# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 46 సంచిక : 6 విజయవాడ 20-7-2013 పేజీలు : 8 వెల : రు 5.00


లోపలి పేజీల్లో...


◈ కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ డెన్మార్క్ రాజకీయ ప్రకటన

◈ ఈజిప్టు : ప్రజల నిరసనోద్యమం - సామ్రాజ్యవాదుల జిత్తులు

◈ రాజ్యపు ఆమోదం, ప్రేరణలతో ఇష్రత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్

◈ గుత్తకార్పొరేటు, ప్రైవేటు వృత్తి-ఇంజనీరింగ్ సంస్థల విద్యావ్యాపారానికి గేట్లు బార్లాతెరుస్తున్న ప్రభుత్వ విధానాలు


### విప్లవ కమ్యూనిస్టు నాయకుడు, మార్క్సిస్టు-లెనినిస్టు మేధావి

## కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చూపిన బాటలో పయనించటం ద్వారా నిజమైన నివాళి అర్పిద్దాం!



**ప్రముఖ** విప్లవ కమ్యూనిస్టు నాయకుడూ, యోధుడూ, మార్క్సిస్టు - లెనినిస్టు మేధావీ అయిన కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి అమరులై 37 సంవత్సరాలైంది. భారతమాతకు సిసలైన దేశభక్తులైన ముద్దుబిడ్డల్లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఒకరు.

ఆయన తన విద్యాభ్యాసకాలమంతటా బ్రిటీషు వలసవాదుల దోపిడీ - ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప దేశభక్తుడు. ఆయన గొప్ప వక్త, ఆందోళనకారుడు, ఆర్గనైజర్. అంతేకాక గొప్ప మార్క్సిస్టు - లెనినిస్టు దార్శనికుడు. ఆయన అటు బ్రిటీషు వలసవాదానికి వ్యతిరేకంగా మాత్రమేకాక, ఇటు దేశంలోని భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా కూడా పలు పోరాటాలను నడిపిన కమ్యూనిస్టు విప్లవకారుడు.

1947లో అధికార మార్పిడి జరిగిన తర్వాతి కాలంలో, 1952 నుండి 1969 వరకు పార్లమెంటు సభ్యునిగానో, లేక అసెంబ్లీ సభ్యునిగానో వుంటూ వచ్చారు. ఈవిధంగా ఆయన పార్లమెంటరీ విధానంలో వున్న డొల్లతనాన్ని ప్రత్యక్షంగా అనుభవపూర్వకంగా పరిశీలించారు. కా॥నాగిరెడ్డి 1969లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యత్వానికి రాజీనామాచేసి, విప్లవ ప్రజాఉద్యమ నిర్మాణానికి పూనుకొన్నారు. కమ్యూనిస్టు విప్లవకారుల్లో తలెత్తిన మితవాద, అతివాద అవకాశవాదాలు రెండింటికీ వ్యతిరేకంగా పోరాడారు. కమ్యూనిస్టు విప్లవకారుల మధ్య ఐక్యతను సాధించే కృషిని తుదిశ్వాస విడిచేదాకా పట్టుదలతో కొనసాగించారు.

ఆయన తన సుదీర్ఘ పార్లమెంటరీ, కమ్యూనిస్టు ఉద్యమ జీవితంలో, భారతదేశం గురించీ-భారత ప్రజల గురించీ అధ్యయనం చేసి, భారతదేశపు భవిష్యత్తు, భారతదేశ ప్రజల భవిష్యత్తులను గురించి, మార్క్సిస్టు - లెనినిష్టు అవగాహనతో, భారతపాలకుల, పాలకవర్గాల స్వభావ, స్వరూపాలనూ, వారు అనుసరించే దేశ వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలను విశ్లేషించి, దేశప్రజల-దేశ భవిష్యత్తు కోసం గొప్ప విలువైన హెచ్చరికను చేశారు. ఉజ్వలమైన దేశ భవిష్యత్తును ఏ రకంగా సాధించవచ్చో వివరించారు. ఈ హెచ్చరిక, వివరణల సారాంశమే ఆయన 1971-72లలో, సికింద్రాబాదు కుట్రకేసులో ప్రకటించిన "తాకట్టులో భారతదేశం" అన్న తీవ్రమైన హెచ్చరిక.

ఆయన ఆనాటికే దేశంలో పెరుగుతున్న విదేశీపెట్టుబడులను - వాటియొక్క ప్రమాదకర స్వభావాలనూ, వీటి వల్ల దేశంలో కలిగే అనర్ధకర పరిణామాలను సవివరంగా తెలియచేస్తూ, వాటిని నిర్ద్వందంగా వ్యతిరేకించవలసిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

*"విదేశీ పెట్టుబడులంటే, విదేశీ మారకద్రవ్య సంక్షోభాన్ని తీవ్రపరచి మరలా పెట్టుబడి పెట్టడానికి వీలులేకుండా పెట్టుబడిని కుదించేటటువంటి నిరంతరాయమైన తరలింపు!"*

*"విదేశీ రుణం పెరుగుదల భారత ఆర్ధిక వ్యవస్థలో పెరుగుతున్న సంక్షోభానికి ప్రగాఢమైన సూచిక!"*

*"విదేశీగుత్తాధిపతుల ప్రత్యక్షపెట్టుబడి అన్నది సామ్రాజ్యవాదం చొరబాటుకు ముఖ్యమైనసాధనాలలో ఒకటి!"*

*"మనదేశం (యితర దేశాలతో) చేసుకొంటున్న మిలాఖత్ ఒప్పందాలలో అత్యధికభాగం అమెరికా వారికి లేదా పశ్చిమదేశాల వస్తువుల అదనపు నిల్వలను అమ్ముకోవటానికి తక్షణ మార్కెట్టుగా భారతదేశాన్ని మార్చివేసేందుకు ముసుగు మాత్రమే!"*

*"ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ఫైనాన్సు కార్పొరేషన్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ఆసియా అభివృద్ధి బ్యాంకు లాంటి అంతర్జాతీయ ద్రవ్యసంస్థలన్నీ అర్ధఅధికార స్వభావంకల అమెరికన్ సంస్థలే!"*

*"వివిధ ఆర్ధిక సమస్యలపై సలహాలను యివ్వటం, వివిధ పశ్చిమదేశాల నుండి, అంతర్జాతీయ ద్రవ్యసంస్థల నుండి వచ్చే సహాయాన్ని సమన్వయం చేయటానికి ప్రపంచబ్యాంకు మన దేశంలో నెలకొల్పబడింది. మనదేశంలో 1957 నుంచే దేశ ఆర్ధిక రాజకీయ పరిస్థితుల గురించి ప్రపంచబ్యాంకు వార్షిక నివేదికలు తయారుచేస్తోంది......... ఆవిధంగా ప్రపంచబ్యాంకు, తన సహాయాన్ని స్వీకరించే దేశాల వ్యవహారాలలో నిత్యమూ, స్థిరంగా, జోక్యం చేసుకొంటూవుంది."* అని 37 సంవత్సరాలనాడే, విదేశీపెట్టుబడులు - అప్పులు - సహాయంపట్ల అప్రమత్తంగా వుంటూ, సామ్రాజవాదానికి ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదానికి దోపిడీ, ఆధిపత్య సాధనాలుగా వున్న వీటినీ, వీటి విధానాలనూ వ్యతిరేకించాలని, దేశీయావసరాలకు తగ్గ విధానాలను అనుసరించటం ద్వారా మాత్రమే దేశం పరాధీనం అయే ప్రమాదాన్నుండి కాపాడగలుగుతామని హెచ్చరించిన మహోన్నత మార్క్సిస్టు-లెనినిష్టు దార్శనికుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి.

నాడు ఆయన భారతజాతిని రాబోయే ప్రమాదం పట్ల అప్రమత్తంచేస్తూ చేసిన హెచ్చరికలు నేడు అక్షరసత్యాలయ్యాయి.

భారతపాలకులూ, పాలకవర్గాలూ పట్టుదలతో అమలుపరచిన సామ్రాజ్యవాద అనుకూల, దేశ - దేశప్రజల వ్యతిరేక నయా ఉదారవాద ఆర్ధికవిధానాలు ఈనాడు దేశాన్ని, దేశంలోని అన్నిరంగాలను తీవ్రమయిన సంక్షోభంలోకి నెట్టాయి. సామ్రాజ్యవాదానికి, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదానికి

**(తరువాయి 2వ పేజీలో)**

ప్రకటన

## గ్రామ పంచాయతీ ఎన్నికలలో భూస్వామ్య దోపిడీపాలక వర్గ పార్టీల ప్రతినిధులను ఓడించండి

## రైతు, కూలీ, గ్రామీణపేదల, కష్టజీవుల మధ్య చీలికలు కల్పించే పాలకుల కుటిల యత్నాలను త్రిప్పికొట్టండి

**మరో** మారు పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. జులై 9న నామినేషన్ల ఘట్టంతో మొదలై మూడు విడతలుగాసాగే ఈ తంతు ఈనెలాఖరుదాకా కొనసాగనుంది. పంచాయతీల ఎన్నికల ప్రకటన వెలువడటానికి చాలాకాలం ముందునుండే గ్రామాలలో పాలకపార్టీల ముఠాల, గ్రూపుల నాయకుల హడావుడి మొదలుకాగా, ఇపుడు అది మరింత జోరందుకుంది. కులపరంగా సమీకరణలు, ప్రత్యర్ధులకు బెదిరింపులు, బుజ్జగింపులు, డబ్బుప్రలోభాలకు తోడు ఈసారి వేలంపాటల ద్వారా అభ్యర్ధుల 'ఏకగ్రీవ ఎంపిక ప్రక్రియ' పెద్దఎత్తున సాగుతోంది.

దేశ, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలతో ఏమాత్రం సంబంధం లేని, తమ స్వార్ధ, స్వీయ ప్రయోజనాలే పరమావధిగావున్న పాలకపార్టీలు ఎన్నికలలో ఏవిధంగానైనా తామే పైచేయి సాధించేందుకు పడరాని పాట్లన్నీ పడుతున్నాయి. పనిలో పనిగా రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు కావలసిన సన్నాహాలు చేసుకుంటున్నాయి. అధికారపార్టీ - అమ్మహస్తం (నిత్యావసరాలు), బంగారుతల్లి (ఆడపిల్లలకు), రూపాయికి కిలోబియ్యం, రాజీవ్‌యువకిరణాలు(యువతకు ఉపాధి), వడ్డీలేని రుణం (మహిళలకు, రైతులకు), ప్రభుత్వ ఉద్యోగాల జాతర, ఇందిరమ్మ జలప్రభ(భూపంపిణీ), రాజీవ్ విద్యాదీవెన (విద్యార్ధులకు), ఇందిరమ్మ అమృతహస్తం (గర్భిణులకు, బాలింతలకు), స్త్రీనిధి (మహిళాబ్యాంకు), ఇందిరమ్మ గృహాలు, వృద్ధుల, వికలాంగుల, వితంతువుల పింఛన్లతోపాటు యస్.సి., యస్‌టి సబ్‌ప్లాన్‌లవంటి లెక్కకు మించిన పథకాలతో హోరెత్తిస్తుండగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఇవన్నీ తమ పథకాల నకళ్ళుగా పేర్కొంటూ, అధికారంలోకి వచ్చేందుకు మరెన్నో చిట్కాలను ప్రయోగిస్తున్నది. రాజన్న రాజ్యం లక్ష్యంగా ఒకపార్టీ పాదయాత్రలు సాగిస్తుండగా, మరోసారి మతం కార్డుతో గట్టెక్కేందుకు ఇంకో పార్టీ పావులు కదుపుతోంది.

గ్రామ పంచాయతీలకు; మండల, జిల్లా ప్రజా పరిషత్తులకు, స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించటంద్వారా ప్రజలే పరిపాలకులంటూ, గ్రామ స్వరాజ్యం సాధిస్తామంటూ పాలకులు ఆర్భాటంగా ప్రకటిస్తున్నారు. వాస్తవానికి రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన గత ఆరు దశాబ్దాలపైగా కాలంలో గ్రామపంచాయతీలకు కనీసపాటి అధికారాలను ఈ పాలకులు విదిలించలేదన్నది వాస్తవం. ఈ పంచాయతీల పాలనలో గ్రామీణపేదల జీవితాలు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదన్నదీ అంతే వాస్తవం.

రెండు దశాబ్దాలక్రితం ఎన్నోరకాల ఆందోళనలఫలితంగా, 73వ రాజ్యాంగ సవరణద్వారా 29 రకాల అధికారాలను గ్రామపంచాయతీలకు బదలాయిస్తున్నట్లుగా పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్నారు. 1995లో రాష్ట్ర శాసన సభలో వీటిని చర్చించి 9 రకాల అధికారాలకు కుదించారు. ఆ మేరకైనా అమలుచేసిన పాపాన ఏనాడూ పోలేదు. 80శాతం పైగా ప్రజానీకం ప్రధానంగా ఆధారపడి జీవిస్తున్న గ్రామీణ ప్రాంతాల ప్రజల ముక్కు పిండి అధిక ఆదాయాన్ని రాబట్టుకుంటున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు (ఏ పార్టీలు అధికారంలోనున్నప్పటికీ) పంచాయతీలకు కేటాయించాల్సిన నిధులను, అధికారాలను ఇవ్వకుండా మొండిచేయి చూపుతూ వస్తోన్నాయి. పైగా, పంచాయతీ పరిధిలోని వనరులపై తమ గుత్తాధిపత్యాన్నే చెలాయిస్తూ పంచాయతీలను నామమాత్రం చేశాయి. అనేక గ్రామ పంచాయతీలు తమ కార్యాలయాల విద్యుత్తు బిల్లులుకూడా చెల్లించుకోలేని దుస్థితికి నెట్టబడ్డాయి. మురుగు కాల్వల నిర్మాణానికి సైతం ప్రపంచ బ్యాంకువద్దకు జోలెపట్టే పాలకులు, గ్రామపంచాయతీల స్వయంపోషకత్వానికి, అధికారాల చెలామణీకి తోడ్పాటునందిస్తారనుకోవటం భ్రమే అవుతుంది.

గ్రామీణ ప్రాంత ఆర్ధికానికి కీలకమైన రైతులు ముఖ్యంగా కౌలురైతులు, సన్న - చిన్నకారు, మధ్యతరగతి రైతులంతా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనది మొదలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులలో నాసి, నకిలీ, కల్తీలతో తీవ్ర నష్టాలపాలవుతున్నారు. సాగునీటిసమస్యలు, ప్రకృతి విపత్తులను ఎదుర్కొని చేతికొచ్చిన పంటను దళారీలకు తెగనమ్ముకుంటున్నారు.

రైతులకు ఇచ్చే రుణాలపై వడ్డీ నాలుగుశాతం మించరాదని, చక్రవడ్డీ అమలుచేయరాదని, అసలుకంటే వడ్డీ మించరాదని వలస పాలకుల కాలంలోనే చట్టాన్ని రూపొందించారు. కాగా, ఈనాటి పాలకులు సహకార రుణసంస్థలను దివాళా తీయించి, బ్యాంకులద్వారా రుణాలను క్రమంగా తగ్గించివేస్తూ, మరోవైపున రుణాలు చెల్లించలేక పోయినందుకు చెంబూ తపాలా బైటవేసి రైతుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే నీచమైన స్థితికి ఒడిగడుతున్నారు. వ్యవసాయ అవసరాల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడేవైపుగా రైతాంగాన్ని నెడుతున్నారు. పంటను తెగనమ్మగా చేతికొచ్చిన డబ్బు మొత్తం చెల్లించినా రుణభారం తీరకపోగా ఏడాదికేడాది అప్పుల ఊబిలో కూరుకుపోతూ, అందునుండి బయటపడలేక దేశ వ్యాపితంగా లక్షలాదిమంది రైతులు బలవన్మరణాల పాలవుతున్నారు.

భూమిహీనులైన గ్రామీణ నిరుపేద వ్యవసాయ కూలీల, చేతివృత్తుల వారి జీవనం మరింత దుర్భరంగా సాగుతోంది. వ్యవసాయంలో ట్రాక్టర్లు మొదలుకొని ఆధునిక యంత్రాల వినియోగం పెరుగుతుండటంతో వ్యవసాయకూలీలకు సంవత్సరంలో సగటున 60 రోజులకు మించి పనిదొరకటమే గగనమైపోయింది. వేలకోట్ల రూపాయల నిధులతో, పెద్ద ఎత్తున ప్రచార ఆర్భాటాలతో దేశవ్యాపితంగా ప్రారంభించిన 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం' కూడా పాలకవర్గాల క్రిందిస్థాయి దొంతర్లకు ఫలహారంగా మారిపోయింది. దీనితో ఉపాధి కరువై బతుకుతెరువు కోసం, పొట్టచేతబట్టుకు పట్నాలకు వీరి వలసల తీవ్రత పెరిగింది.

'పారిశ్రామిక అభివృద్ధి' ముసుగులో, నిక్షేపంగా పంటలు పండే భూములతోసహా వేలాది ఎకరాల భూములను రైతుల నుండి ప్రభుత్వాలు గుంజుకొని బడాపెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెడుతున్నాయి. రుణభారంతో వ్యవసాయం నుండి బలవంతంగా వైదొలుగుతున్న రైతుల సంఖ్య పెరుగుతోంది. మరోవైపున బడా సంపన్న వర్గాలు గ్రామీణ ప్రాంత వ్యవసాయ భూములను పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. దీనితో గైర్హాజరీ భూస్వాముల (ఆబ్సెంట్ ల్యాండ్‌లార్డ్స్) సంఖ్య పెరుగుతోంది.

**(తరువాయి 4వ పేజీలో)**

## కా॥ గంటి ప్రసాదంకు జోహార్లు

**అమరుల** బంధుమిత్రుల కమిటి గౌరవాధ్యక్షుడు కా॥ గంటి ప్రసాదం (64సం॥లు)పై 2013 జులై 4న నెల్లూరులో గుర్తుతెలియని సాయుధ ముఠా దాడిచేసి హత్యగావించింది. గత కొన్ని సంవత్సరాలుగా 'అమరుల బంధుమిత్రుల కమిటీ' బాధ్యతల్లో బహిరంగంగా పనిచేస్తున్న కా॥ గంటి ప్రసాదం హత్యను సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి తీవ్రంగా ఖండిస్తోంది. ప్రజా ఆందోళనాకారులను భౌతిక దాడులతో మట్టుబెట్టే ఈ విధమైన ఫాశిస్టు చర్యలను ప్రజలు, ప్రజాతంత్రవాదులు తీవ్రంగా నిరసించాలి. కా॥ గంటి ప్రసాదం హత్యపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి వాస్తవాలను వెల్లడించాలని, హంతకులను కఠినంగా శిక్షించాలని సిపిఐ(ఎం-ఎల్) డిమాండ్ చేస్తూ కా॥ గంటి ప్రసాదంకు జోహార్లర్పిస్తోంది. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోంది. ★

## పి.ఎల్.నాయుడుకు జోహార్లు

**ప్రముఖ** న్యాయవాది పరువాడ లక్ష్మునాయుడు 83ఏళ్ళ నిండు వయసులో అనారోగ్యంతో మృతిచెందారు. పాత శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం తాలూకా, నిడగల్లు గ్రామంలో 1929లో ధనిక రైతు కుటుంబంలో జన్మించిన పిఎల్ నాయుడు బెనారస్ యూనివర్శిటీ నుండి లా డిగ్రీ పొందారు. పార్వతీపురంలోనూ, విశాఖపట్నంలోనూ న్యాయవాదిగా వృత్తిసాగించారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాలతో ఆకర్షితులైన పిఎల్‌నాయుడు కార్మికుల తరఫున, గిరిజనుల తరఫున, పేద ప్రజల తరఫున న్యాయవాదిగా నిలిచారు. పౌరహక్కుల ఉద్యమానికి తోడ్పాటునందించారు. కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధిని కాంక్షించారు.

పార్వతీపురం కుట్రకేసులో అనేకమంది గిరిజనులతరపున న్యాయవాదిగా పనిచేశారు. వారికి బెయిల్స్ యిప్పించటమూ, విచారణలో వారి తరపున వాదించటం చేశారు. ప్రజాఉద్యమాలన్నింటికీ సహకారమందించేవారు. పేదలకు ఉచితంగా న్యాయసహాయమందించారు.

కా॥పి.ఎల్.నాయుడుగారి కుటుంబ సభ్యులకు "జనశక్తి" తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నది. కా॥ పి.ఎల్.నాయుడుకు జోహార్లు తెలుపుతున్నది. ★

**విప్లవ కమ్యూనిస్టు ...** (మొదటి పేజీ తరువాయి)

భారతపాలకులూ, పాలకవర్గాలూ సేవకులుగా మారిపోయారు. దేశంలోని పెట్టుబడిదారీవర్గం విదేశీ పెట్టుబడిదారులతో మిలాఖతుఅయి వాళ్ళు విదిలించే ఎంగిలి మెతుకులు ఏరుకుని లాభపడే దళారీ పెట్టుబడిదారీ వర్గంగా ఖాయమైపోయింది.

ఈరోజున భారతదేశంలోని అంతర్గత వ్యవహారాలూ, ఆర్థిక విధానాలనూ, వాటి అమలును, ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యసంస్థ, ఆసియా అభివృద్ధి బ్యాంకులు స్థిరంగా, ప్రత్యక్షంగా, నిత్యం జోక్యం చేసుకుంటూ నిర్దేశించి, నిర్ణయించే స్థాయికి దేశ పరిస్థితులు మారిపోయాయి. ఆఖరికి గ్రామాల్లో చెరువులు తవ్వాలన్నా, రోడ్లు వేయాలన్నా, విద్యుత్తు సరఫరా సదుపాయం చేయాలన్నా, పంటలు పండించే వివిధ కార్యకలాపాలు నిర్వహించాలన్నా, నీరు త్రాగాలన్నా, పంటలకు సాగునీరు పెట్టాలన్నా ప్రపంచబ్యాంకు అప్పుపై ఆధారపడి, ప్రపంచబ్యాంకు నియంత్రణకు లోబడి, ప్రపంచబ్యాంకు ఆదేశానుసారం దేశ వ్యవహారాలను నిర్వహించాల్సిన దుస్థితిలోకి నెట్టబడ్డాం. మనదేశ ప్రజలు ఏం చదువుకోవాలో, ఏవిధంగా జీవితాలను వెళ్ళమార్చుకోవాలో అన్న విషయాలు కూడా ప్రపంచబ్యాంకు యొక్క యిష్టా యిష్టాలకు అనుగుణంగా చేయాల్సివస్తోంది.

ఇటీవల ప్రపంచబ్యాంకు యిచ్చిన సమాచారం ప్రకారమే, మనదేశం జాతీయాదాయపు సూచికలో, ఆసియాలోని శ్రీలంకకన్నా, యూరప్‌లోని టర్కీకన్నా, దక్షిణ అమెరికాలోని చిలీదేశంకన్నా, ఆఫ్రికాలోని ఈజిప్టు దేశంకన్నా అధమస్థాయిలో వుంది. దీనిని బట్టి, మన పాలకులూ, పాలకవర్గాలూ బాకాలూదుతున్న మనదేశపు ఆర్థికాభివృద్ధి ఎంత అబద్ధమయినదో, ప్రపంచబ్యాంకు తదితర అంతర్జాతీయ సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలచే నిర్వహింప బడుతున్న ఈ 'సంస్కరణ'ల విధానాలు మనదేశాన్ని ఎంతటి అధోగతిలోకి నెట్టాయో అర్థమౌతుంది.

ఇటీవలనే జాతీయ శాంపిల్ సర్వేసంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) ఒక నివేదికను వెల్లడించింది. దాని ప్రకారం మన దేశంలో నిరుద్యోగం దారుణంగా పెరిగిపోతోంది. ప్రతి వెయ్యిమంది గ్రామీణులలోనూ 2% నిరుద్యోగం పెరిగింది. పట్టణ ప్రాంతాలలో 3% నిరుద్యోగం పెరిగింది. గత రెండు సంవత్సరాలలోనూ 10% మేరకు నిరుద్యోగం పెరిగిపోయింది.

అదే సర్వే నివేదిక (2011-2012) ప్రకారం దేశంలో 6కోట్ల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో వున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వాళ్ళు రోజుకు కేవలం 17 రూపాయలనూ, పట్టణ ప్రాంతాల్లో 23 రూపాయలనూ మాత్రమే ఖర్చు పెట్టగలిగిన స్థోమతతో జీవితాలను ఈడ్చవలసిన స్థితిలో వున్నారు. కిలో సాదాబియ్యం కనీసం 35రూపాయలు పెట్టినా దొరకని ఈరోజుల్లో ఈ పేదలు తమకున్న ఆర్థిక స్థోమతతో ఏం తిని బ్రతకాలో? అన్నది మానవ ఊహకు అందని విషయం. ఈ దౌర్భాగ్యస్థితికి కారణం మన పాలకులు గత 23ఏళ్ళుగా అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, ప్రపంచబ్యాంకు నిర్దేశిత నయాఉదారవాద ఆర్థిక విధానాలే అని వేరుగా చెప్పవలసిన పనిలేదు.

ఐక్యరాజ్యసమితికి చెందిన ఆరోగ్యసంస్థ ఇటీవలి నివేదిక ప్రకారం మనదేశంలోనే ప్రపంచంలో అన్ని దేశాలకన్నా ఎక్కువగా గర్భిణీస్త్రీలూ, పసిపిల్లలూ మరణిస్తున్నారు. వీరిలో నాల్గోవంతు మంది రక్తహీనతతో మరణిస్తూవుంటే, 19%మంది కాల్షియం లోపంవలన మరణిస్తున్నారు. 15 సంవత్సరాల నుండి 19 సంవత్సరాలు గల బాలికల్లో 34%మంది పౌష్టికాహారంలేక గిడసబారిపోతున్నారు. ఈ దుస్థితికి కారణం, మనపాలకులు అనుసరిస్తున్న అమలు జరుపుతున్న సామ్రాజ్యవాద అనుకూల, నయా ఉదారవాద విధానాలేనన్నది నిర్వివాదమైన విషయం.

ఈ నయా ఉదారవాద ఆర్థిక విధానాలను అనుసరించటం ద్వారా, జి.డి.పి.ని పెంచి దేశ ఆర్థికాభివృద్ధిని పెంచుతామంటూ మనపాలకులూ, పాలకవర్గాలూ పదే పదే ప్రచారం చేస్తున్నాయి. తీరా చూస్తే 2012-13లో మనదేశంలోని జి.డి.పి వృద్ధి కేవలం 5% మాత్రమే. ఇది గత 10 సంవత్సరాలలో అతి తక్కువ జి.డి.పి.రేటు. ఇక ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ సంస్థల అంచనా ప్రకారమైతే ఈ సంవత్సరంలో 5%కన్నా తక్కువ జి.డి.పి మాత్రమే వచ్చే అవకాశం వుంది. జి.డి.పి ప్రకారం మనదేశ ఆర్థికాభివృద్ధిని గురించి అంచనా వేయదల్చుకున్నా రోజురోజుకీ మనదేశపు ఆర్థికాభివృద్ధి ఎదగకపోగా క్షీణించిపోతున్నదన్నదే నిత్యసత్యం!.

ఇక విదేశీ అప్పుల విషయానికొస్తే ఈ సంవత్సరం మార్చి మాసాంతానికి స్వల్పకాలిక విదేశీరుణం 17,200 కోట్ల డాలర్లకు చేరుకొంది. దీర్ఘకాలిక విదేశీ అప్పు 29,340కోట్ల డాలర్లకు చేరుకుంది. ఈ పెరుగుతున్న విదేశీ అప్పు, కా॥ నాగిరెడ్డి హెచ్చరించినట్లు నిరంతరం పతనమౌతున్న మనదేశ ఆర్థిక వ్యవస్థకు ప్రగాఢమైన సూచికగా వుంది. మనదేశం ఎంతటి ప్రమాదకర పరిస్థితుల్లోకి కూరుకుపోయిందో? అన్న విషయాన్ని అనూహ్య స్థాయికి పెరిగిన ఈ విదేశీ అప్పులు స్పష్టం చేస్తున్నాయి.

ఇంత ఘోరంగా విదేశీ అప్పులు, పెట్టుబడుల పెరుగుదల వలన మనదేశం తీవ్రమయిన ఆర్థిక సంక్షోభంలో యిరుక్కుపోతున్నా కూడా, మన పాలకులు - పాలకవర్గాలూ ఇంకా దేశంలోకి విదేశీ పెట్టుబడులు ప్రవహించటం కోసం నిబంధనలను సరళీకృతం చేస్తున్నారు. రిటైల్, ఇన్సూరెన్స్, విమానయానం, రక్షణ, ఎలక్ట్రానిక్స్ రంగాలలో విదేశీ పెట్టుబడి శాతాన్ని దారుణంగా పెంచేశారు. పెంచటానికి తగ్గ విధాన నిర్ణయాలను చేస్తున్నారు. దేశంలో నిపుణులూ, సాంకేతికశాస్త్ర మేధావులూ యిబ్బడిముబ్బడిగానే వున్నాకూడా ఐ.టి.రంగంలోని ఎలక్ట్రానిక్స్ భాగాలను మనదేశంలో ఉత్పత్తిచేసి, వాటిని ఆ రంగంలోని పరిశ్రమలకు సరఫరా చేయకుండా విదేశాలనుండే దిగుమతి చేసుకునేందుకు అనువుగా, యిటీవలనే ప్రధానమంత్రి కార్యాలయం, విదేశీ కార్పొరేట్ల వత్తిడికి తలొగ్గి విధాన నిర్ణయం చేసింది. దీనికి అందంగా 'ప్రిఫరెన్షియల్ ఏక్సెస్' (మార్కెట్‌లో ఏరకమైన సరుకులు ఎవరివద్ద కొనుగోలు చేసుకునే ప్రాధాన్యతను యిస్తాయో, వాటిని అందుబాటులోకి తేవటం) అని పేరుపెట్టి, 2012 ఫిబ్రవరిలోనే దానికి కేబినెట్ ఆమోదాన్ని పొందారు.

అది చాలదన్నట్టు ప్రస్తుతం దేశ ఆర్థికమంత్రి, 'మాదేశంలో పెట్టుబడులు పెట్టండి-మీకుకావల్సిన, మీరు కోరిన సదుపాయాలన్నీ చేస్తాం' అంటూ అమెరికాలో పర్యటిస్తూ, అమెరికన్ పెట్టుబడి దారులను దేవుళ్ళాడుతున్నారు.

బిజినెస్ స్టాండర్డు పత్రిక, జూన్ 28నాటి సంపాదకీయంలో చెప్పినట్టు "మనదేశం మొత్తంగా మరింత హానికిగురై యిరుక్కుపోయే అవకాశాలను ఫణంగాపెట్టి, మనప్రభుత్వం మరిన్ని విదేశీ అప్పులు మనదేశంలోకి సునాయాసంగా ప్రవహించటానికి యింకా మిగిలిన విదేశీ అప్పులను అదుపుచేసే నిబంధనలను కూడా సరళీకరించి ఎత్తివేయ జూస్తోంది."

దీనిని బట్టి చూస్తే, కా॥నాగిరెడ్డి చెప్పినట్లు మనపాలకులు, దేశంలో మరింతగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని పెంచే చర్యలద్వారా "సామ్రాజ్యవాదుల, అందునా అమెరికన్ సామ్రాజ్యవాదులచొరబాటుకు" ఈ విదేశీ గుత్తాధిపతుల ప్రత్యక్షపెట్టుబడి ద్వారా రాజమార్గాన్ని వేస్తున్నారన్నమాట.

ఇక పేదలకు, చిన్న - మధ్యతరహా పెట్టుబడి దారులకు, చిన్న, సన్నకారు, కౌలురైతులకు బ్యాంకుల నుండి అప్పుయిప్పించటానికి నిజాయితీ,చిత్తశుద్ధిలతో పూనుకొనని, మనపాలకులు, బ్యాంకుల్లో డబ్బునంతా బడాపెట్టుబడిదారులకూ, పారిశ్రామిక వేత్తలకూ బాహాటంగా దోచిపెడుతున్నారు. ఈ పరిశ్రమాధిపతులూ, బడాపెట్టుబడిదారులూ బ్యాంకుల నుండి అప్పులు తీసుకొని, చెల్లించకుండా ఎగనామం పెట్టిన మొత్తాలకు "నిరర్థక ఆస్తులు" అనే ముద్దుపేరు పెట్టి, ఆ భారాన్ని బ్యాంకుల్లో ఖాతాదారులుగా వున్న సామాన్య, మధ్యతరగతి ఖాతాదారుల నుండి సేవల రూపంలోనూ, ఛార్జీల రూపంలో, గృహరుణాలు - వాహన రుణాలపై అధికవడ్డీ వసూలు రూపంలోనూ భర్తీచేయిస్తున్నారు. ఇటీవల డెక్కన్ క్రానికల్ సంస్థ వివిధ బ్యాంకులకు, ద్రవ్యసంస్థలకూ, వందల కోట్ల రూపాయలను ఎగనామం పెట్టినది తాజా ఉదాహరణగా వుంది.

ఈరకంగా బడా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు బ్యాంకుల నుండి అప్పుతీసుకుని ఎగకొట్టిన మొత్తాలు 2011 మార్చినాటికి 71,080 కోట్లు కాగా అది డిసెంబరు 20, 2012 నాటికి 1,55,000కోట్లకు చేరింది. ఈ ఎగవేత మొత్తాలు కేవలం ప్రభుత్వరంగ బ్యాంకులకు సంబంధించినవే. ఇందిరాగాంధీ హయాంలో బ్యాంకులను జాతీయం చేస్తూ, యిది దేశప్రజలకు మేలుచేసే సంస్కరణ అంటూ పాలకులూ, పాలకవర్గ మేధావులూ ప్రచారం చేశారు. నాడే ఒక సంవత్సర కాలపు ప్రభుత్వరంగ బ్యాంకుల ఆచరణను పరిశీలించి కా॥నాగిరెడ్డి ఈ బ్యాంకుల జాతీయకరణ అనేది బడాపెట్టుబడి దారుకూ, భూస్వాములకూ మేలుచేకూర్చే చర్యే తప్ప, సాధారణ ప్రజలకు ఏవిధంగానూ మేలుచేకూర్చదు అని నిర్ధారించారు. సరీగ్గా యిప్పుడు అలాగే జరిగినట్లు ఈ 'నిరర్థక ఆస్థుల' వ్యవహారం రుజువుచేస్తోంది. తీరాచూస్తే ఈ 'సంస్కరణ' బడాపెట్టుబడిదారులకూ, భూస్వాములకే ప్రయోజనకరమైనది అని అనుభవంలో తేలిపోయింది. నిజంగా ఈ 1,55,000కోట్లను ప్రభుత్వబ్యాంకులు వ్యవసాయరంగ అభివృద్ధికి యిచ్చివుంటే, మనదేశంలో ఈనాడు యింతటి సంక్షోభం ఏర్పడి వుండేదికాదు.

ఇప్పుడు పాలకులు చాలా చాకచక్యంగా అట్టడుగు ప్రజలతో సహా, అందరూ జరిపే ఆర్థిక లావాదేవీలు బ్యాంకుల ద్వారానే జరిగేవిధంగా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం యిచ్చే సబ్సిడీలు నేరుగా, వాటిని అందాల్సిన పేదలకు అందజేస్తామనే పేరిట, నిష్టదరిద్రులు సహితం తప్పక బ్యాంకు ఖాతాదారులు అవాల్సిన స్థితికి బలవంతంగా నెట్టారు. మరోవైపు నిరుపేదలకు సంక్షేమపథకాలంటూ, వాళ్ళనుండి ఎంతో కొంత వాళ్ళవాటాగా వసూలుచేసే పలు 'ఇన్సూరెన్సు' పథకాలను రంగంలోకి తెచ్చారు. నిజానికి ఈ చర్యలన్నీ బ్యాంకుల్లోనూ, యితర సంస్థల్లోనూ ప్రజలు దాచుకొన్న డబ్బును పెంచటం ద్వారా 'ద్రవ్యచలామణీ'ని పెంచి, ఈ సంస్థల్లో సామాన్యులు దాచుకొన్నడబ్బును అదే బడా పరిశ్రమాధిపతులకు, పెట్టుబడిదారులకు, భూస్వాములకు అప్పులు యివ్వటం కోసమే! ఈరకంగా బడా పారిశ్రామికవేత్తలూ, పెట్టుబడిదారులూ, భూస్వాములూ ఎగగొట్టిన అప్పుల నష్టాన్ని నిరుపేద ప్రజల నుండి పూడ్చుకొనే ప్రయత్నాలను విజయవంతంగా, తమ విధానాల ద్వారా అమలులోకి తెస్తున్నారు.

ఇక ఆధార్‌కార్డులు తదితర 'ఆధునిక' కార్డుల జారీ రూపంలో, ప్రజల నుండి సేకరించిన అన్నిరకాల వివరాలనూ, ప్రపంచ ప్రజలందరిపై నిఘాపెట్టి, ప్రపంచాన్ని శాసించదలుచుకొన్న అమెరికన్ సామ్రాజ్యవాదులకు అందజేసి, మొత్తం మనదేశ గుట్టునంతా సామ్రాజ్యవాదుల ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదులకు వెల్లడిస్తున్నారు మన పాలకులు.

పంటపొలాలను బలవంతంగా స్వాధీనం చేసుకొని, విదేశీ పరిశ్రమాధిపతులకు, ధారాదత్తం చేస్తూ, సామ్రాజ్యవాదులకు తమ స్వభావాన్ని నిస్సిగ్గుగా చాటుకొంటున్నారు పాలకులు.

కా॥తరిమెల నాగిరెడ్డి చెప్పినట్లు ఇప్పటికే మన దేశాన్ని "అమెరికా వారికి లేదా పశ్చిమదేశాల వస్తువుల అదనపు నిల్వలను అమ్ముకొనే తక్షణ మార్కెట్టుగా" మార్చివేశారు మనపాలకులు. ఇది చాలదన్నట్లు దేశంలోని అన్నిరంగాలలోకీ విదేశాల్లో (అమెరికా, పశ్చిమదేశాల్లో) తయారయే వస్తువులు సర్వవ్యాపితమయిపోయి అమ్ముడుపోవాలనే 'సదుద్దేశంతో' మన పాలకులు యింకా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టుకోండంటూ బ్రతిమాలుకుంటున్నారు. ఈరకంగా దేశాన్ని పరాధీనం చేశారు.

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చెప్పినట్లు "………. రాబోయే దశాబ్దాల వరకూ(యిప్పుడైతే శతాబ్దాలు అనివుండేవారు) దేశపు వనరులు సర్వస్వాన్నీ విదేశీ దోపిడీదారులకు అమ్మివేస్తున్న ఈ సిగ్గుచేటైన పరిస్థితులను మార్చటానికి, తనలో దేశభక్తి అణుమాత్రమున్న ఏ పౌరుడైనా వాటిని వ్యతిరేకిస్తాడు. భారతజాతి సముజ్వల కీర్తిని పునఃప్రతిష్ఠించటానికి పాటుపడతాడు."

సరీగ్గా యిప్పుడు నిజమైన దేశభక్తులన్న వారెవరయినా చేపట్టాల్సిన కర్తవ్యం అదే! అందుకు చిత్తశుద్ధిగా పూనుకొన్నప్పుడే కా॥ తరిమెల నాగిరెడ్డికి నిజమైన నివాళి అర్పించినట్టవుతుంది.

మనదేశంలోని ఈ సిగ్గుచేటైన పరిస్థితులు మార్చటానికి పోరాటంచేపడదామని ఈ 38వ వర్ధంతి సందర్భంగా మనం ప్రతిజ్ఞచేద్దాం!

- కా॥తరిమెల నాగిరెడ్డికి జోహార్లు!
- అమరవీరులకు జోహార్లు
- నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి
- మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి

★

నాల్గవ ముద్రణ వెల : రూ.150/-




ప్రచురణ : తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్
కాపీలకు : మైత్రీబుక్‌హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ డెన్మార్క్ రాజకీయ ప్రకటన

**కోపెన్ హెగెన్ 2012 మే 19**

*కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ డెన్మార్క్ విడుదల చేసిన రాజకీయ ప్రకటనను అనువదించి ఇస్తున్నాము. దీనిని వారి పార్టీ 5వ మహాసభ ఆమోదించింది. పాఠకుల అధ్యయనంకోసం దీనిని ప్రచురిస్తున్నాము.*

*పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద వ్యవస్థ సంక్షోభాన్నీ, దానినుండి బయటపడేందుకు పాలకవర్గాలు తీసుకుంటున్న చర్యల నిష్ఫలతను ఇది వివరించింది. సంక్షోభానికి పరిష్కారంగా యుద్ధాలు, నిర్బంధ అణచివేత, నాజీహింసాకాండ పెరుగుతున్న తీరును వివరించింది. యూరపు దేశాలలో కార్మికుల, యువత స్థితిగతులతోపాటు డెన్మార్కు ఆర్థిక, రాజకీయ పరిస్థితిని కూడా ఈ ప్రకటన వివరించింది. శీర్షిక మాది.*

**– సంపాదకుడు**

**2006లో** ప్రారంభమై 2007–08 నాటికి పూర్తిగా విరుచుకుపడిన సంక్షోభాన్నుండి ప్రపంచ పెట్టుబడిదారీ విధానం బయటపడలేకపోవటం ఈనాటి ప్రపంచ పరిస్థితిలో కొట్టవచ్చినట్లు కన్పించే పరిణామం.

అంతర్జాతీయ కార్మికసంస్థ అంచనాల ప్రకారం 20 కోట్లు, అంటే 6.1శాతం శ్రామిక జనాభా నిరుద్యోగులుగా వున్నారు. కాగా యూరోపియన్ యూనియన్ దేశాలలో నిరుద్యోగం రికార్డు స్థాయికి చేరింది. స్పెయిన్‌లో 23.6 శాతం, గ్రీసులో 21శాతం, ఐర్లాండులో 15శాతం, పోర్చుగల్‌లో 14.7 శాతం, బల్గేరియాలో 12.4 శాతానికి చేరింది. యువతలో నిరుద్యోగుల శాతం మరింత ఎక్కువగా వుంది.

నూతన ప్రపంచ వ్యవస్థ అన్నదానిని సంక్షోభం కుదిపివేసింది. ఇది సౌభాగ్యాన్నీ, శాంతినీ, వెలుగునిండిన భవిష్యత్తును మెజారిటీ ప్రజలకందిస్తుందన్న ప్రచారం అబద్ధమని నిరూపించింది. కనుకనే కార్మికవర్గంయొక్క, యువతయొక్క, ప్రజలయొక్క పోరాటాలు ప్రపంచమంతటా తిరిగి పుంజుకోవటం గమనిస్తున్నాము.

ట్యూనీసియా, ఈజిప్టు, ఇతర అరబ్బుదేశాలలో విప్లవ తుఫాను చెలరేగి అభివృద్ధి నిరోధక నిరంకుశ పాలకులను కూల్చివేశాయి. యూరపులో వర్గపోరాటం తీవ్రమౌతున్నది. గ్రీసు, స్పెయిన్, ఇటలీ తదితర దేశాలలో యువత మిలిటెంటు నిరసన ఉద్యమాలు చేపట్టింది. నయాఉదారవాద దాడులను ఎదుర్కొనటానికి కార్మికులు కూడా కదిలారు. సంక్షోభం వచ్చిన తర్వాత ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించిన 8 దేశాలలోని ప్రభుత్వాలు మారిపోయాయి.

## సంక్షోభానికి వేసిన ఫలితమివ్వని మందు

గృహ, ద్రవ్యరంగంలో చట్టా జూదంతో పెట్టుబడిదారీ ప్రపంచ సంక్షోభం మొదలై తీవ్రమైంది. వాస్తవానికిది పెట్టుబడిదారీ అధికోత్పత్తి సంక్షోభం. కార్మికుల, ప్రజల కొనుగోలుశక్తి తగ్గి సరుకులు అమ్ముడుకాక ఏర్పడిన సంక్షోభం. సంక్షోభంలో పడిన బ్యాంకులకు అందజేసిన నిధులు ప్రజలు చెల్లించిన పన్నులే. దీనితో ఈ దేశాలు రుణాల ఊబిలో కూరుకుపోయాయి.

యూరోపిన్ యూనియన్ దేశాలలో ప్రభుత్వ బడ్జెట్టు వ్యయాన్ని బాగా తగ్గించి వేశారు. పరిస్థితి అన్ని దేశాలలోనూ ఒకే విధంగా వుంది. ప్రభుత్వ రంగంలో పెద్దఎత్తున పనినుండి తొలగింపులు సాగాయి. సామాజిక సేవలు కుంటుపడ్డాయి. విద్యా, వైద్య సంస్థలను కుదించివేశారు. వీటిని ప్రైవేటీకరిస్తున్నారు. పెన్షన్లు, తదితర ఆర్థిక సేవలను బాగా తగ్గించి వేశారు.

ఏదో ఒక రూపంలో కార్మికుల వేతనాలలో కోత విధించటంతోపాటుగా, పనిగంటలు, పని భారాలను పెంచుతున్నారు. 110 శాతం శ్రమశక్తి పెంచాలన్న పెట్టుబడిదారుల డిమాండును అందుకోలేని కార్మికులు పనినుండి తీసివేయబడి దారిద్ర్య జీవనంలోకి నెట్టబడుతున్నారు. కార్మిక మార్కెట్టు సంస్కరణల పేరిట ఇవి అమలుజరుపుతున్నారు.

మరొక మాటల్లో చెప్పాలంటే, సంక్షోభానికి మూల్యం చెల్లిస్తున్నది కార్మికులు, యువత, సామాన్య ప్రజలే. కాగా గుత్తపెట్టుబడిదారులు ఆస్తులూ లాభాలూ పెంచుకున్నారు. ఉద్యోగుల తొలగింపు, వ్యయం తగ్గింపు, నిజవేతనాల కోత వంటి చర్యలేవీ సంక్షోభాన్నుండి బయట పడవేయలేకపోయాయి. దీనికి విరుద్ధంగా 2012 మధ్యనాటికి మరో ఆర్థికమాంద్యం యూరపులో తలెత్తింది. ఈ పెట్టుబడిదారీ మందు పని చేయలేదు.

వృద్ధిని సాధించేందుకు రుణాలు చేయటంవంటి ఇతర పెట్టుబడిదారీ పద్ధతులు కూడా సంక్షోభాన్నుండి బయటపడవేయలేకపోయాయి. ఎందుకంటే సంక్షోభాల చక్రభ్రమణంనుండి బయటపడగల శక్తి పెట్టుబడిదారీ విధానానికి లేదు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం సుదీర్ఘకాల మాంద్యరూపం తీసుకున్నది. దీనినుండి కోలుకునే అవకాశాలు కన్పించటంలేదు. ఐఎల్ఓ అంచనాల ప్రకారం ప్రతిఏడూ నిరుద్యోగం పెరిగిపోతూ 2016 నాటికి 21 కోట్లకు చేరుతుంది.

"సంక్షోభ మూల్యం మేము చెల్లించం! పెట్టుబడిదారులనే చెల్లించమనండి" తదితర నినాదాలతో కార్మికులు, యువత, నిరుద్యోగులు, పెన్షనర్లు పెట్టుబడిపై పోరాటాలను సాగిస్తున్నారు. సంక్షోభం కొనసాగుతున్న కొలదీ జి–20, జి–8, ఇయు, ఐఎంఎఫ్‌వంటి వేదికల పైనా, పార్లమెంటులపైనా వున్న ఆశలు ఆవిరై పోతున్నాయి. పెట్టుబడిదారీ రాజకీయ నేతల సౌభాగ్య జీవన వాగ్దానాలు నీటిమూటలని తేలిపోతున్నాయి. నూతన పరిష్కారాలూ, నూతన మార్గాలను కార్మికులు, యువత వెతుకుతున్నారు.

సంక్షోభంలోవున్న పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభ భారాన్ని కార్మికులూ, ప్రజలపై మోపటంతోపాటుగా, ఇతర దేశాలూ, ప్రజలపై దురాక్రమణ యుద్ధాలు సాగించి సంక్షోభంనుండి బయటపడే అభివృద్ధి నిరోధక పద్ధతులకు దిగుతున్నది.

## రెండవ మందు–యుద్ధం

"నూతన ప్రపంచ వ్యవస్థ" అంటే శాశ్వత యుద్ధాలని అర్థం. 1991లో అమెరికా, పశ్చిమ దేశాలు సాగించిన గల్ఫ్ యుద్ధం తర్వాత, 1990లో అమెరికా, నాటోలు సాగించిన సెర్బియాపై యుద్ధం తర్వాత, 21వ శతాబ్దంలో అమెరికా, దాని సైనిక కూటమి నాటో నిరంతరాయ యుద్ధాలు సాగిస్తున్నాయి.

2001 సెప్టెంబరు 11తర్వాత ఆఫ్ఘన్ యుద్ధం వచ్చింది. అదింకా ముగియలేదు. దురాక్రమణ శక్తులు అక్కడ ఓటమి చవిచూడక తప్పదు. 2003లో ఇరాక్‌పై యుద్ధం చేశారు. ఇది ఒకరకంగా సామ్రాజ్యవాదులకు ఓటమే. 2011లో లిబియాపై యుద్ధం సాగించారు. ఇది పశ్చిమ దేశాలకూ, ఛాందసవాద శక్తులకు మధ్యనున్న సంబంధాన్ని బయటపెట్టింది. సిరియాలో దీనినే పునరావృతంచేసేందుకు, ఇరాన్‌పై దురాక్రమణకు సామ్రాజ్యవాదం సన్నాహాలు చేస్తున్నది.

సామ్రాజ్యవాదుల ఈ ప్రణాళికలే శాంతికి విఘాతం కలిగిస్తున్నాయి. మధ్యప్రాచ్యం, ఆసియాలో దురాక్రమణలను కొనసాగిస్తూ ఆఫ్రికాలోకి సైనిక విస్తరణ సాగిస్తున్నాయి.

అమెరికా సామ్రాజ్యవాదులు, నాటోల సైనికీకరణ, ఆయుధాల పెంపుదలతో ప్రపంచంలో ఏప్రాంతం కూడా శాంతితో మనలేదు. చివరికి ఉత్తర ధృవప్రాంతమైన ఆర్కిటిక్‌కు కూడా వీరి సైనికీకరణ విస్తరించింది.

"టెర్రరిజంపై పోరు" అన్న దానితో యుద్ధ వ్యతిరేక ఉద్యమం అభివృద్ధి చెందుతున్నది. ఈ ఉద్యమం ప్రస్తుత యుద్ధాలను వ్యతిరేకించటమేకాక, విదేశీ సైన్యాలన్నీ వెనక్కుమళ్లాలనీ, కొత్త యుద్ధాలు చేయరాదనీ, నాటో సైనిక కూటమిని రద్దుచేయాలని డిమాండు చేస్తున్నది. యుద్ధనేరస్తులను శిక్షించాలని కూడా కోరుతున్నది.

## మూడవ మందు–పోలీసు రాజ్యం

"ప్రచ్ఛన్న యుద్ధం" మొదలైన నాటినుండీ యుద్ధోన్మాదంతో వున్న దేశాలలోని పౌరసమాజం సైనికీకరణ చెయ్యబడటం సాగుతున్నది. సామ్రాజ్యవాద యుద్ధాలు ఒక కొత్త తరహా సైనికుల్ని తయారు చేస్తున్నాయి. నయా వలసవాద దురాక్రమణ యుద్ధాల భావజాలంతో పెంచబడిన ఈ సైనిక నిపుణులు రిటైరైన తర్వాత జాతీయ "వీరులు"గా సామాజిక జీవనంలో ప్రముఖ స్థానాన్ని పొందుతున్నారు. యుద్ధాన్ని సమర్థించే వాదనలూ, యుద్ధ ప్రచారాలతో పత్రికలు, టివీలు, సినిమాలు నిండిపోతున్నాయి. యుద్ధాన్ని వ్యతిరేకించే వారిని అంటరానివారుగా చూస్తున్నాయి. అదేసమయంలో పౌర ఉద్యమాలపై సైనికులను ప్రయోగించటానికి ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు.

సామ్రాజ్యవాద దేశాలు పోలీసు రాజ్యంగా రూపొందే క్రమంలో వున్నాయి. ఇంటర్‌నెట్‌లో పౌరులపై నిఘా, బహిరంగ, ప్రైవేటుజీవనంపై నిఘా ఊహకందని స్థాయికి పెరిగాయి. అలాగే టెర్రరిజం చట్టాలను సమగ్రంగా రూపొందించి, రాజకీయ నిరసన గొంతు నులిమేదిగా నడిపిస్తున్నారు. 2009 కోపెన్‌హెగెన్‌లో జరిగిన పర్యావరణ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా సాగించిన విచ్చలవిడి అరెస్టులు దీనికుదాహరణ. ఎన్నికయిన రాజకీయ నాయకులను కుట్రలతో తొలగించి, వారి స్థానంలో బూర్జువాలు కోరిన వారిని రాజకీయ నేతలుగా ముందుకు తెచ్చేందుకు రాజకీయ నిరసనల్లో జోక్యం చేసుకోవటం కీలకమైనదిగా వుంది. 2011లో గ్రీసు, ఇటలీలలోని పరిణామాలు ఇలాగే సాగాయి. ఇది మొత్తం ప్రజాస్వామిక సంస్థలను నిర్వీర్యంచేసే దాడిగా వున్నది.

పోలీసురాజ్యం వృద్ధి, సామాజిక జీవన సైనికీకరణ, ప్రజాస్వామ్యాన్ని తొలచివేయటం, టెర్రరిజం చట్టాలు, వాక్స్వాతంత్ర్యానికి వ్యతిరేక చర్యలు, రాజకీయ కార్యాచరణపై శిక్ష–ఇవన్నీ ప్రపంచ స్థాయి ధోరణిగా వున్నాయి. అన్ని దేశాల కార్మికవర్గ ఉమ్మడి పోరాటాలలో భాగంగా వున్నాయి.

## నాల్గవ మందు–నాజీ టెర్రర్

పెట్టుబడిదారీ వ్యవస్థ, దాని పాలకవర్గమూ సంక్షోభంతో అస్థిరస్థితిలో ఉన్న సమయంలో అన్నిరకాల తీవ్ర మితవాద ధోరణులూ తలెత్తి విస్తరించటం యాదృచ్ఛిక పరిణామం కాదు.

మితవాద తీవ్రవాదం, జాతీయ తిరోగమనవాదం, నయానాజీవాదం బలపడటమూ, ఫాసిజం, నాజీయిజాల నాయకుల పునరుద్ధరణా పాలకుల ఉద్దేశ్యపూరిత విధానమే. దేశచట్టాలకు విరుద్ధమైన వీటిపై ఐరాస ఎలాంటి చర్యా తీసుకోకపోవటమే దీనిని తెలుపుతోంది.

ఈ వాతావరణంలో నార్వేలో సోషల్ డెమాక్రాటిక్ యువశిబిరంపై బాంబుదాడి చేసిన బ్రెవిక్‌వంటి వారు పుడుతున్నారు. వలసవచ్చినవారు నివసించే స్వీడన్‌లోని మాల్మో బస్తీపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి భయోత్పాతాన్ని కల్పించిన పీటర్‌మాంగ్స్‌లు పుడుతున్నారు. వలసవచ్చిన వారి షాపులపై దాడిచేసి "కెబాబ్ హత్యలు" సాగిస్తున్న నాజీలు(పోలీసుల సహకారంతో) జర్మనీలో ముందుకొస్తున్నారు.

వలసవచ్చిన వారిపైనా, వామపక్షాలవారిపైనా, విప్లవకారులపైనా ఎంచుకొని దాడులు చేస్తున్న వీరిని మానసిక వికలాంగులుగా చిత్రించేందుకు పోలీసులు, ప్రభుత్వ లాయర్లు, డాక్టర్లు, పత్రికలూ అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. అయితే పాలకవర్గాల భావజాలమూ, విధానాలూ, వాటికిస్తున్న ప్రచారమూయొక్క ప్రత్యక్ష ఫలితమే ఈ పాశవిక నాజీ టెర్రరిస్టులు.

నాజీ టెర్రరిజం, దాని నేరాలకు బలిఅవుతున్నది అమాయక ప్రజలు. అయినా బూర్జువా పత్రికలు వామపక్ష తీవ్రవాదమే దీనికంటే ప్రమాదకరంగా చిత్రిస్తున్నాయి. కమ్యూనిజమూ, నాజీయిజమూ సమానమని ప్రచారం చేస్తున్నాయి. నాజీ టెర్రరిస్టు చర్యలకు పూర్తి ప్రచారాన్నిస్తాయి. మొత్తం కమ్యూనిస్టులను, విప్లవకారులనూ, వామపక్షీయులను తుడిచిపెట్టే జాతి నిర్మూలనా కార్యక్రమం ముందు కొస్తున్నది. ఇవ్వాళా రేపా అన్నదే.

## నూతన మార్గం కోరుతున్న యువత, కార్మికులు

సంక్షోభమంటే కార్మికుల నిజవేతనాలలో తగ్గుదల; ప్రజల జీవన పరిస్థితులలో క్షీణత. కోట్లాదిమంది ఆకలి బారిన పడుతున్నారు. దారిద్ర్యంలో కూరుకుపోతున్నారు.

అదే సమయంలో సామాజిక అశాంతి పెరుగు తున్నది. నిరసనలు, ప్రదర్శనలు, సమ్మెలు ప్రపంచ మంతటా పెరుగుతున్నాయి. ఐఎల్ఓ 2012 నివేదిక ప్రకారం 106 దేశాలకుగాను 57 దేశాలలో సామాజిక అశాంతి గత ఏడాదికంటే పెరిగింది. ఈ ధోరణి యూరపు, మధ్యప్రాచ్యం, ఉత్తరాఫ్రికా, సహారా దేశాలలో ఎక్కువగా వుంది.

ప్రపంచంలో ఆర్థిక సంక్షోభంతోపాటుగా ఇతర సంక్షోభాలు కూడా పెరుగుతున్నాయి. పర్యావరణ–శక్తివనరుల సంక్షోభాలు మానవాళి భవిష్యత్తుపై తీవ్ర పరిణామాలను కలిగివుంటాయి. మానవకల్పిత భూతాప పెరుగుదలా, వినాశనాలు పేద దేశాలనూ, పేద ప్రజలనూ ఎక్కువగా తాకుతున్నాయి.

అలాగే అణువిధ్వంసం కూడా. ఫుకిషిమా అణుప్రమాదం దీనిని మరోసారి తెలియజెప్పింది. శక్తి ఉత్పత్తి విధానాలు మార్చుకోవటం పెట్టుబడిదారీ వ్యవస్థలో అసాధ్యం.

నిరుద్యోగం అన్ని దేశాలనూ కబళిస్తున్నది. యువత భవిష్యత్తు చీకటి మయంగా వుంది. తమ తల్లిదండ్రులు పొందిన జీవనస్థాయి తమకు అందుబాటులోకి వస్తుందన్న ఆశ వారికి లేదు. విద్య, ఉపాధి, ఆర్థిక అంశాలలో వారి స్థితి దిగజారుతున్నది.

ప్రపంచ వ్యాపితంగా యువత పెట్టుబడిదారీ సంక్షోభానికీ, దాని పర్యవసానాలకూ వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. కార్మికవర్గం కూడా నిరసనలు, ప్రదర్శనలు, రాజకీయ సమ్మెల బాటపట్టింది. అరబ్బు దేశాలలో ప్రజావెల్లువలు విద్యావంతులైన నిరుద్యోగు లందరినీ సమీకరించాయి. సగం మంది యువత నిరుద్యోగులుగా వున్న స్పెయిన్‌లో ఎమ్–15 వంటి ఉద్యమాలు నిర్వహించారు. పార్లమెంటరీ ప్రత్యామ్నాయా లను నిరాకరిస్తున్నారు. గ్రీసు, పోర్చుగల్, ఇటలీలలోని యువత కూడా ఉద్యమిస్తున్నారు.

ఈ సమయంలో కార్మికవర్గంలో కదలిక ఆశావహంగా వుంది. అనేక యూరపు దేశాలలో పొదుపు చర్యలకు వ్యతిరేకంగానే కాకుండా, యూరోపియన్ యూనియన్, ఐఎంఎఫ్‌లు రుద్దుతున్న విధానాలకు వ్యతిరేకంగా కూడా సార్వత్రిక సమ్మెలు చేస్తున్నారు. ఆవిధంగా అవి రాజకీయ స్వభావాన్ని సంతరించు కుంటున్నాయి. గ్రీసులో ప్రజల జీవనాన్ని కల్లోలభరితం చేస్తున్న విధానాలను రుద్దిన "త్రయం"కు (యూరోపియన్ యూనియన్, యూరోపిన్ సెంట్రల్ బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్) వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. యూరోపియన్ యూనియన్‌పై పెట్టుకున్న ఆశలు కొడిగట్టాయి. శాంతి, సౌభాగ్యాలందిస్తుందన్న ప్రచారం సాగిన ఇ.యు., గుత్త పెట్టుబడిదారుల చేతిలో సాధనమని వారు తెలుసు కుంటున్నారు. సంక్షోభం వచ్చిన తర్వాత ఎనిమిది ప్రభుత్వాలను ప్రజలు తొలగించారు. ఏ కార్యక్రమం కలిగివున్నా, "సోషలిస్టు" పేరు పెట్టుకున్నా, బూర్జువా పేరు పెట్టుకున్నా పాలక పార్టీలన్నీ ఒకే విధానాలు అనుసరిస్తున్నాయి. అమెరికాలో రెండు పార్టీల ప్రకటిత విధానం విఫలమైనట్లుగానే, యూరపులో కూడా అప్రకటిత రెండు పార్టీల విధానం విఫలమైంది. వీటిపట్ల విశ్వాసం ప్రజల్లో నానాటికీ సన్నగిల్లుతున్నది.

అదే సమయంలో కోతల విధానాలపై పోరాడాలని కార్మికులు తమ యూనియన్లను డిమాండు చేస్తున్నారు. దీనితో "సోషలిస్టు" పార్టీలతో సంబంధాలున్న ఇటియుసి (యూరోపియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్)ని యూరోపియన్ యూనియన్ బిగ్గరగా విమర్శిస్తున్నది.

పార్లమెంటరీ కూటములకు వెలుపల స్వతంత్ర పోరాట చేవగల సంస్థలూ ఉద్యమాలను పోరాట సాధనాలుగా పెంపొందించే ధోరణి బలంగా ముందుకు వస్తున్నది. ఎమ్–15, "ఆక్రమించు" వంటి ఉద్యమాలు ఇలాంటివే. ఇవి ప్రజా ఉద్యమాలను మిలిటెంటుగా నడిపే దిశగా వున్నాయి.

పార్లమెంటు స్థాయిలో కూడా మూడవ ప్రత్యామ్నాయం కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. గ్రీసులో వామపక్ష కూటమి సిరైజా, ఫ్రాన్సులో ఫ్రంట్‌డిగాచీ (వామపక్ష సంఘటన) ఇలాంటివే.

ఇయు విధానాలకూ, ఆర్థిక ఒప్పందానికీ, యూరపు గుత్తపెట్టుబడిదారులకు వ్యతిరేకంగా సమిష్టి పోరాటాన్ని యూరపు కార్మికులు, ప్రజలు సాగించాలి. అవి ఇయు నుండి భాగస్త దేశాలను వేరుచేసే దిశగా సాగాలి. సామ్రాజ్యవాద ఆర్థిక, రాజకీయ సంఘమైన ఇయు రద్దుకూ, ప్రతిదేశమూ స్వంత కరెన్సీ, సంస్థల ఏర్పాటుకూ సాగే దిశగా ఈ పోరాటాలుండాలి.

## సంక్షోభం, యుద్ధం, సమాఖ్యలో డెన్మార్క్

పదేళ్ల వికెఓ పార్టీ స్థానంలో డెన్మార్క్‌లో అధికారంలోకి వచ్చిన ఎస్ఆర్ఎస్ఎఫ్ ప్రభుత్వం గత ప్రభుత్వపు ఇయు విధానాలనే అమలు జరుపుతున్నది. ఈ పార్టీలేవీ తాము ఏ విధానాలు అనుసరిస్తారో ఓటర్లకు చెప్పటంలేదు. కొన్ని ప్రజాకర్షణ కలిగిన నినాదాలతో ఎన్నికల్లో గెలుస్తున్నాయి. గెలిచిన తర్వాత ఇయు విధానాలను అమలుచేస్తున్నాయి.

వికెఓగానీ, ఎస్ఆర్ఎస్ఎఫ్‌గానీ డెన్మార్క్‌ను సంక్షోభం నుండి బయటపడవేయలేకపోయాయి. సంక్షోభం తీవ్రమవుతుండగా, ప్రజలు ఉద్యోగాలు కోల్పోతుండగా, అనేకమంది ఇళ్లనుండి నెట్టివేయ బడుతుండగా, నిజవేతనాలు తగ్గి, ధరలు పెరుగుతుండగా, ఈ పార్టీలు "సంక్షోభం నుండి బయటకు" "సౌభాగ్యవంత భవిష్యత్తు" నినాదాల మంత్రజపం చేస్తున్నాయి.

వికెఓ ప్రభుత్వానికి పూర్తిగా భిన్నమైన విధానాన్ని చేపడతానన్న వాగ్దానంతో థార్నింగ్ అధికారంలోకి వచ్చాడు. కానీ గత ప్రధాని ఆండర్స్ ఫాగ్ అనుసరించిన అమెరికా మరియు నాటోల విశ్వసనీయ సేవకు "చురుకైన విదేశాంగ విధానాన్నే" కొనసాగిస్తున్నాడని త్వరగానే వెల్లడయింది.

ఇక సంక్షోభానికి పరిష్కారాలు కూడా గతంలోవే. వేతనాల కోత, సామాజిక సేవల కుదింపు, బ్యాంకులకు ప్రజాధనం కట్టబెట్టడం కొనసాగుతున్నాయి. ప్రజలు కోరుతున్న విధంగా ఆర్థిక ఒప్పందాన్ని రిఫరెండంకు పెట్టడాన్ని నిరాకరిస్తున్నాడు.

తేడాఅల్లా వికెఓ ప్రభుత్వం వేతనాలలో కోతల స్థానంలో పనిగంటలూ, పనిభారం పెంచి కార్మికులతో ఎక్కువ శ్రమచేయిస్తోంది. **(తరువాయి 4వ పేజీలో)**

# ఈజిప్టు

# ప్రజల నిరసనోద్యమం-సామ్రాజ్యవాదుల జిత్తులు

**రెండేళ్లక్రితం** ఒకదాని తర్వాత మరొకటిగా ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలలో వచ్చిన ప్రజా తిరుగుబాట్లు, అమెరికా ఇతర సామ్రాజ్యవాదుల మద్దతుతో సాగుతున్న అక్కడి నిరంకుశ ప్రభుత్వాలకు వ్యతిరేకంగాసాగాయి. ఈ ప్రజా ఉద్యమాలు ప్రజాస్వామిక ఆకాంక్షలనూ, డిమాండ్లనూ ముందుకు తెచ్చాయి. అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వాలు రుద్దుతున్న సామాజిక అన్యాయాలపై ఆగ్రహాన్ని వెలిగక్కాయి. ఈ నిరసనోద్యమాలలో ప్రధానభాగం స్పష్టమైన రీతిలో సామ్రాజ్యవాద వ్యతిరేక డిమాండ్లను ముందుకు తీసుకురాలేదు. అయినప్పటికీ వీటిలో సామ్రాజ్యవాద వ్యతిరేకత అన్న కోణం లేదని భావించరాదు. వాస్తవానికి ఈ దేశాలలో ప్రజలు ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లపై జరిగిన సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధాలను ఖండించారు. పాలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావం తెలుపుతూ వచ్చారు. సామ్రాజ్యవాద వ్యవస్థ కూరుకుపోయిన సంక్షోభానికి ఈ దేశాల ప్రజాజీవనం గురైన నేపథ్యంలో ఈ ఉద్యమాలు వచ్చాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ రుద్దిన నయా ఉదారవాద విధానాలు ప్రజలను ఆకలి, నిరుద్యోగాల బారిన పడవేశాయి. ఇవి ప్రజలలో పాలకులపట్ల ఆగ్రహాన్ని కలిగించాయి. ఉదా : ఈజిప్టు జనాభాలో 75శాతం 30 సంవత్సరాల లోపువారే. వీరిలో అత్యధికులు నిరుద్యోగులు. సమూల సామాజిక మార్పులేకుండా తమ భవిష్యత్తు చీకటిమయమౌతుందని యువత గుర్తించారు. ఈ పరిణామాన్ని చూసి అమెరికా తదితర సామ్రాజ్యవాదులు భీతిల్లారు. ఉత్తర ఆఫ్రికా ప్రాంతంలోని తమ తొత్తు ప్రభుత్వాలను తొలగించక తప్పదని భావించారు. ప్రజాఉద్యమ తుఫాను నుండి బయటపడటానికి తమ కనుకూలంగా వుండే వర్గాల చేతుల్లోకే అధికారం బదలాయించబడే విధానాలు అనుసరించారు.

ఈ విధానాల ఫలితంగా ఈజిప్టులో పరిణామాలు సాగాయి. ది క్లాస్ స్ట్రగుల్ (మార్చి 2011) వ్యాఖ్యానించినట్లుగా, "చివరిక్షణం వరకూ ముబారక్‌ను కాపాడేందుకు అమెరికా సామ్రాజ్యవాదం ప్రయత్నించింది. అది సాధ్యంకాదని తేలిపోయిన తర్వాత అతన్ని చెత్తబుట్టలో వేసింది... అమెరికాకు విశ్వాసనీయ వర్గాలకూ, రాజకీయశక్తులకూ అధికారాన్ని బదలాయింప చేసింది....అయితే అమెరికా కోరుకున్న విధంగా లేదా అది నిర్దేశించిన మార్గంలోనే రాజకీయ పరిణామాలు సాగుతాయని చెప్పలేము".

ఈజిప్టులోని ప్రజాఉద్యమాన్ని ముస్లిం తీవ్రవాదమని అమెరికా సామ్రాజ్యవాదం దుష్ప్రచారం చేసింది. అయినా ముస్లిం ఛాందసవాద సంస్థ 'ముస్లిం సహోదరత్వం'ను ప్రోత్సహించింది. దాని అనుబంధ సంస్థ ఐన ఫ్రీడమ్ అండ్ జస్టిస్ పార్టీని 2012 జూన్‌లో సైన్యం నిర్వహించిన ఎన్నికల్లో గెలిచే విధంగా చూసింది. దాని నాయకుడు మహమ్మద్ మోర్సీని అధ్యక్షుడిగా చేసింది.

మోర్సీ ప్రభుత్వం అధికారంలోకి రావటం యువతలో అనేక ఆశలను రేకెత్తించింది. అయితే మోర్సీ ప్రభుత్వం వారి ఆశలపై నీరుజల్లింది. సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలు రుద్దిన విధానాల అమలును కొనసాగించింది. ఈజిప్టు ఆర్థిక వ్యవస్థ క్రుంగిపోయింది. ప్రధాన ఎగుమతులైన టెక్స్‌టైల్ పరిశ్రమకవసరమైన చమురును దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం వద్ద ధనంలేకుండా పోయింది. దానితో ఈ మిల్లులు మూతపడ్డాయి. కార్మికులు వీధినపడ్డారు. అలెగ్జాండ్రియా నగరంలో కార్మికులు అనేక సమ్మెలు చేశారు. నిరుద్యోగం పెరిగిపోయింది. పెద్దఎత్తున ప్రజానిరసన ప్రదర్శనలకు దారితీసిన-మంచి ఉద్యోగం, బ్రతకగలిగే వేతనం, తగిన సామాజిక సేవలు, ప్రజాస్వామిక హక్కులువంటి మౌలిక డిమాండ్లు వేటినీ మోర్సీ ప్రభుత్వం తీర్చలేదు. మరోసారి తెహ్రీర్ స్క్వేర్ ప్రజానిరసన ప్రదర్శనలకు కేంద్రమైంది.

దీనితో ఎన్నికల్లో మోర్సీ విజయాన్ని ప్రజావిప్లవ విజయమని కీర్తించిన సైన్యం "జాతీయ సామరస్య" ప్రభుత్వాన్ని 48 గంటల్లోగా ఏర్పాటు చెయ్యమని మోర్సీకి తాఖీదు యిచ్చింది. ఆ సమయం చాలదని మోర్సీ అన్నా వినిపించుకోకుండా, సైన్యం అతన్ని అధికారంనుండి తొలగించినట్లు ప్రకటించింది. అధికారాన్ని కైవశం చేసుకున్న సైనిక ముఠా అధిపతి జనరల్ అబ్దుల్ ఫత్యా ఖలీల్ అల్‌సిసి ఒక రాజకీయ "రోడ్‌మ్యాప్"ను ప్రకటించాడు. దీనిలో భాగంగా రాజ్యాంగ చట్టాన్ని రద్దుచేశాడు. "జాతీయ సాంకేతిక నిపుణుల" ప్రభుత్వాన్ని నియమించాడు.

వర్గ ప్రయోజనాలపట్ల నిష్పక్షపాతంగా వుండగల రాజకీయంగా తటస్థ నిపుణులు అన్న భావాన్ని కలిగించేందుకు "సాంకేతిక నిపుణులు" అన్న పదాన్ని వాడారు. వాస్తవానికి ఈ "సాంకేతిక నిపుణు"లనే వారు అంతర్జాతీయ బ్యాంకులకు సేవకులు. రాజ్యాంగ చట్ట న్యాయస్థానం జడ్జి ఆద్లీ మన్‌సార్‌ను అధ్యక్షుడిగానూ, నేషనల్ సాల్వేషన్ పార్టీ నాయకుడు అల్‌బరాడీ(ఇరాక్‌పై దాడి సమయంలో ఐరాస అణుశక్తిసంస్థ సభ్యుడిగా పని చేసిందీయనే) ప్రధానమంత్రిగా సైన్యం ప్రకటించింది. అల్ అజర్ ఈమామ్ అహ్మద్‌అల్ తయ్యబ్, ప్రతిపక్ష తమరాద్ నాయకుడు మహమూద్ బదర్, అతిమితవాద సలాఫి పార్టీ నాయకుడు యూనిస్ ముఖియుమ్, అనేకమంది సైనికాధికారులు ప్రభుత్వ నేతలుగా నియమింపబడ్డారు. ప్రజల్లోని విశాల భాగం మద్దతు కొత్త ప్రభుత్వానికుందని చూపెట్టుకొనేందుకు సైన్యం వీరందరినీ ఎంచుకుంది. వీరిలో హోస్నిముబారక్ తొత్తులుగా చాలాకాలం పనిచేసిన వారున్నారు. ముస్లిం మత రాజకీయాలు నడిపే వారున్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధితో దగ్గర సంబంధాలు కలిగివుండి ఉదారవాదులుగా చెలామణీ అయ్యే వారున్నారు. వీరిలోని వ్యక్తులకుగానీ, సంస్థలకుగానీ ప్రజారాసులతో సంబంధాలు లేవు. ప్రజలు కోరే డిమాండ్లతో కూడిన కార్యక్రమంలేదు. నానాటికీ పెరుగుతున్న ఈజిప్టు కార్మికుల, ప్రజల నిరసన ఉద్యమాన్ని అడ్డుకుని, అణచివేసే ఏకైక లక్ష్యంతోనే సైన్యం జోక్యం చేసుకుంది.

అమెరికా సామ్రాజ్యవాదం మోర్సీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నది. అయితే దానిని కాపాడటం సాధ్యంకాదని తేల్చుకున్న తర్వాత ఒబామా ప్రభుత్వం ఈజిప్టు సైన్యానికి మద్దతు తెలిపింది. అమెరికా సైన్యాధికారి(ఛైర్మన్ ఆఫ్ జాయింట్ ఛీఫ్స్ ఆఫ్ స్టాఫ్) మార్టిన్ డెంప్సీతో చర్చలు జరిపి, అతని అనుమతిపొందిన తర్వాతనే ఈజిప్టు సైన్యం తిరుగుబాటుచేసి మోర్సీ ప్రభుత్వాన్ని తొలగించింది. అందుకనే ఒబామా తన ప్రకటనలో "సైనిక తిరుగుబాటు" అన్న పదాన్ని వాడకుండా మోర్సీ ప్రభుత్వాన్ని సైన్యం తొలగించటాన్ని సమర్థించాడు. "ప్రజాస్వామికంగా ఎన్నికైన పౌర ప్రభుత్వానికి వీలయినంత త్వరగానూ, బాధ్యతాయుతం గానూ అధికారాన్ని తిరిగి అప్పగించే దిశగా కదలాల"ని మాత్రమే ఈజిప్టు సైన్యాన్ని ఒబామా "కోరాడు".

ముబారక్ ప్రభుత్వం "ముస్లిం సహోదరత్వం"ను నిరంకుశంగా అణచివేసింది. అణచివేతకు గురైన సంస్థగా అది 2012 జూన్ ఎన్నికల్లో అధికారంలోకి రాగలిగింది. ఇప్పుడు అధికారంనుండి తొలగించబడి మధ్యంతర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీధి పోరాటాలకు దిగింది. సైన్యానికీ, 'ముస్లిం సహోదరత్వా'నికి మధ్య సాగుతున్న ఘర్షణ పాలకవర్గంలో రెండు ముఠాలమధ్య అధికారం కొరకు ఘర్షణ. మధ్యంతర ప్రభుత్వం, 'ముస్లిం సహోదరత్వం'పై దాడిసాగిస్తున్నట్లు పైకి కన్పిస్తున్నప్పటికీ, దాని అసలు లక్ష్యం ఈజిప్టు కార్మికులు, ప్రజలు. ప్రజల నిరసనోద్యమం "జాతీయ ప్రయోజనాలకు" హానికరమనీ, చట్టవ్యతిరేకమనీ ప్రకటించి దాడికి సన్నాహాలు చేస్తున్నది.

అధికారం నుండి మోర్సీ ప్రభుత్వాన్ని సైన్యం తొలగించటంపట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తమైంది. సైనిక పాలనపై ప్రజల్లో వున్న భ్రమను ఇది తెలుపుతుంది. అయితే మోర్సీని తొలగించి అధికారం దక్కించుకుంది సైన్యం మాత్రమేననీ, ప్రజలకు అధికారం దక్కలేదనీ, ప్రజాఉద్యమానికి దారితీసిన డిమాండ్లు వేటినీ సైనిక ప్రభుత్వం నెరవేర్చబోదని గత రెండున్నరేళ్ల అనుభవం తెలుపుతున్నదని గుర్తించాలి.

గత మూడేళ్లుగా ఈజిప్టులో వచ్చిన పరిణామాలు విలువైన గుణపాఠాలను అందిస్తున్నాయి.

మొదటిగా : మూడేళ్ల ఉద్యమంలో ప్రజలు నిర్వహించిన కీలకపాత్ర. నిజమైన చరిత్ర నిర్మాతలు ప్రజలే. వారు కార్యాచరణలోకి దిగినప్పుడు ఉనికిలోవున్న వ్యవస్థను తొలగించగల, అణచివేతను ఎదుర్కోగల వారిశక్తి వెలికివచ్చి ఇనుమడించింది.

రెండు : సామ్రాజ్యవాద వ్యవస్థలో మౌలిక వైరుధ్యాలను మార్క్సిస్టు-లెనినిస్టు పద్ధతిలో విశ్లేషణయొక్క ప్రాసంగికతను ఈ ఉద్యమాలు తెలిపాయి. ఈ వ్యవస్థను బద్ధలుచేయగల గొలుసులోని బలహీనలింకులను గుర్తించవలసిన అవసరాన్ని తెలిపాయి.

చివరిగా : స్వీయాత్మక అంశపు నిశ్చయాత్మక ప్రాధాన్యతనూ, రాజకీయ నాయకత్వపు ప్రాధాన్యతనూ, ప్రజారాశుల నిర్మాణయుత సంస్థ ప్రాధాన్యతనూ, రాజకీయ అగ్రగామికీ ప్రజారాశులకూ మధ్య సంబంధ ప్రాధాన్యతనూ, ప్రజాఉద్యమ క్రమాన్ని వీలైనంత పురోగమింపచేయాల్సిన ప్రాధాన్యతనూ, తిరుగుబాటును విప్లవ ప్రక్రియాక్రమంగా మలచాల్సిన ప్రాధాన్యతనూ ఈజిప్టు పరిణామాలు తెలిపాయి. కార్మికవర్గ అగ్రగామిపార్టీ నాయకత్వంలో సాగే వర్గ పోరాటాల ఆవశ్యకతను తెలిపాయి. ★

---

## కమ్యూనిస్టుపార్టీ... (3వ పేజీ తరువాయి)

ఇయు చెప్పిన విధంగా పన్నులనూ, ఫీజులను పెంచివేసింది. సమిష్టి ఒప్పందాల పేరిట నిజవేతనాలు తగ్గించింది. కార్మికులతో ఇంకా ఎక్కువ శ్రమ చేయించేందుకు త్రైపాక్షిక చర్చలను ఇప్పుడు సాగిస్తున్నది. వారానికి సెలవు దినాలను రెండు రోజులకు కుదించటం ఈ చర్చలలో ప్రధానాంశంగా వుంది.

దీనితో సోషలిస్టు డెమోక్రాటిక్ ట్రేడ్ యూనియన్ థార్నింగ్ ప్రభుత్వానికి, ఇయుకి పనిముట్టుగా వెల్లడయి కార్మికుల అసహ్యతకు గురౌతున్నది.

"కార్మికుల కొరత", "వృద్ధుల పోషణభారం" వల్ల ఇది తప్పదని రెండు పాలక కూటములూ వాదిస్తున్నాయి. ఇది పచ్చి అబద్ధం. రిటైర్మెంటు వయసును పెంచారు; నిరుద్యోగ భృతిని రెండేళ్లకు తగ్గించారు. కొన్నాళ్లకు పనిచేయగల వయస్సువారు డెన్మార్కులో తగ్గుతారు గనుక కార్మిక కొరత వస్తుంది. కనుక ఇప్పటినుండే మనం ఎక్కువ పనిచేయాలని వాదన.

దీనికి సమర్ధనగా ప్రభుత్వ గణాంకాలన్నీ తప్పుల తడకలే. 2020 నాటికి ఎక్కువమంది కార్మికులుంటారని జనాభా లెక్కలు తెలుపుతున్నాయి. అలాగే యుద్ధాలను ఆపితే, సైనికీకరణను ఆపితే, నాటో కూటమినుండి డెన్మార్క్ బయటకు వస్తే, ధనాఢ్యులపై పన్నులు పెంచితే వందల కోట్ల నిధులు చేకూరతాయి. అప్పుడు కోతలు విధించనక్కరలేదు. అయితే రెండు పాలక కూటములు ఇది చేయవు గనుక నూతన ప్రత్యామ్నాయాలనూ, మార్గాలనూ మనమే వెతుక్కోవాలి.

### అజండాలోకి తిరిగి విప్లవం

2011లో ట్యునీసియా, ఈజిప్టులలో వచ్చిన "అరబ్బు వెల్లువ", నిరంకుశ పాలకులను తొలగించటం-పెట్టుబడిదారీ సంక్షోభానికీ, అరబ్బు దేశాలలో సామ్రాజ్యవాదుల పనుపున సాగుతున్న అణచివేతకూ ప్రజల ప్రతిస్పందన. అరబ్బు ప్రజలు అనాగరికులు, వెనుకబడినవారు, మతఛాందసులు అన్న సామ్రాజ్య వాదుల దుష్ప్రచారాన్ని ఇది బ్రద్దలుకొట్టింది. ఆర్థిక రాజకీయ అణచివేతకు వ్యతిరేకంగా వారు తిరగబడ్డారు. రాజకీయ, ఆర్థిక, ప్రజాస్వామిక సంస్కరణలను డిమాండు చేశారు. విప్లవ సమస్య, చరిత్ర కాలగర్భంలో కలిసిపోలేదనీ ఈనాటికీ సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక, సోషలిస్టు రూపంలో ప్రాసంగికత కలిగివుందని నిరూపించారు. ఈజిప్టు, ట్యూనిసియాలలోని వెల్లువలు ఆఫ్రికా, దక్షిణ యూరపు, మరి అనేక దేశాలలో యువతకు స్ఫూర్తినిచ్చాయి.

విప్లవం అజండాలోకి వచ్చింది.

అరబ్బు ప్రజలతిరుగుబాట్లను తనవశంచేసుకునేందుకూ, ప్రజాస్వామిక మార్పును తాను లోబర్చుకునేందుకూ సామ్రాజ్యవాదం పూనుకుంది. అమెరికా మద్దతుగల సైనిక ప్రభుత్వమే అక్కడ నెలకొంది. ఇతర అరబ్బు దేశాలలో ప్రజాస్వామిక, లౌకిక శక్తులను అణచేందుకు మత ఛాందస పార్టీలకూ శక్తులకూ మద్దతునిచ్చింది(సౌదీఅరేబియా). బెహరైన్‌లో సైనిక శక్తితో అణచివేసింది. లిబియా ప్రజానీకం తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే సమయంలో నాటో దురాక్రమణ సాగించింది.

ఇయు దేశాలలో సోషలిస్టు విప్లవం అజండాలోకి వచ్చింది.

ప్రగతిశీల శక్తుల సంఘటనకు కార్మికవర్గం ప్రధానశక్తిగా, మార్క్సిస్టు, లెనినిస్టు పార్టీ సారథ్యంలో ఇతర విప్లవకర శక్తులతో చేతులు కలిపి విప్లవం సాగాలి. కార్మికవర్గ నాయకత్వాన సోషలిస్టు సమాజ నిర్మాణం దాని ఆశయంగా వుండాలి. అంటే పాలకవర్గాలను కూలద్రోసి, సంక్షోభాలూ, యుద్ధాలులేని, అణచివేత, దోపిడీ వుండని, జాతి తదితర వివక్షతలుండని, సమాజ సభ్యులందరికీ సమాన హక్కులూ గౌరవం వుండే సమాజం అని అర్థం. ★

---

## గ్రామ పంచాయతీ... (మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా సెజ్‌లు, కారిడార్లు, థర్మల్, అణువిద్యుత్తు కేంద్రాలపేరిట పాలకులు సాగించే తీరప్రాంత విధ్వంసంతో, భూముల పరాయీకరణతో వేలాది రైతుల, మత్స్యకారుల కుటుంబాలు జీవనోపాధికి దూరమై 'నీటి నుండి బయటపడిన చేపల్లా'గా తల్లడిల్లుతున్నారు.

అటవీప్రాంత ఆదివాసీ గ్రామాల పరిస్థితులు కూడా దీనికి భిన్నంగాలేవు. షెడ్యూల్డు ప్రాంతంలో ఆదివాసులకు కనీసపాటి గ్యారంటీలను కల్పించే 1/70, అటవీ హక్కుల చట్టం, పీసా వంటి వాటిని తుంగలోదొక్కి, ఆదివాసులను అడవుల నుండి గెంటివేసి, లక్షలాది ఎకరాల అటవీ భూములను విదేశీ బహుళజాతి కంపెనీలకు ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయి. గ్రామ సభలన్నవాటికి అర్థమే లేకుండాజేశాయి. ఇప్పటికీ కొండకోనల్లో నివసించే వందలాది ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతంగా ప్రకటించకుండా దశాబ్దాలుగా కాలం వెళ్ళదీస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో అగ్రకులాధిపత్య, భూస్వామ్య, పెత్తందార్లు, పాలకవర్గ దళారీలు మొరటు పద్ధతుల్లోనూ, నగిషీలు చెక్కిన నాజూకు రూపాలలోనూ దోపిడీని సాగిస్తూ గ్రామీణ పేదల శ్రమశక్తిని దోచుకుంటున్నారు. హంతక దాడులు, దౌర్జన్యాలు సాగిస్తూ అణచి వేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పాలకపార్టీల ముఠాలుగా వున్న వీరు గ్రామీణ ప్రాంతంలోని అత్యధిక భూములపై ఆధిపత్యం కలిగివుండి, రాజకీయంగా తమ పెత్తనాన్ని సుస్థిరం చేసుకోవటానికి పంచాయితీ ఎన్నికలను సాధనంగా చేసుకుంటున్నారు. అధికారం కోసం వారిలో వారు సాగించే కుమ్ములాటల్లో గ్రామీణ పేదలను బలిచేస్తున్నారు.

సామ్రాజ్యవాదుల లూటీ, దోపిడీలను కొనసాగించటంలో పాలకవర్గ పార్టీల వారెవరికీ భిన్నాభిప్రాయం లేకపోగా, సామ్రాజ్య వాదులకు నమ్మకమైన బంట్లుగా రుజువు చేసుకునేందుకు వీరిలో వీరు పోటీలు పడుతున్నారు. భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాల కొమ్ముగాయటంలో ఎవరికివారే సాటిగా వున్నారు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి వీరేమాత్రం సిద్ధంగా లేరనేది గత ఆరున్నర దశాబ్దాల వీరి ఆచరణే రుజువుగా నిలుస్తోంది.

పైగా, భూమి, ఉపాధి, విద్య, వైద్యం వంటి తమ మౌలిక సమస్యల పరిష్కారానికై కదలిన ప్రజానీకంపై పాశవిక నిర్బంధాన్ని ప్రయోగించటంలో వీరంతా సిద్ధహస్తులే. ఉద్యమాలు మరింత సంఘటితరూపం తీసుకోకుండా, ప్రజల మధ్య కుల, మత, ప్రాంతీయ విద్వేషాల్ని పెంచటంలోనూ, శక్తివంతులైన యువతను పెడదోవపట్టించే విషసంస్కృతిని వారి మెదళ్ళలో దట్టించటంలోనూ, ఓట్ల కోసం డబ్బు సంచులను వెదజల్లటంలోనూ వీరంతా ఘనాపాటీలే. మద్యంతాగటం ఆరోగ్యానికి హానికరమనే ప్రకటనలు ఒక వైపు చేస్తూనే మరోవైపు ప్రతి సంవత్సరం మద్యంపై ఆదాయాన్ని వేలకోట్ల రూ॥లు పెంచుకుంటూ పోతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో మద్యాన్ని ఏరుల్లా పారించటానికి, ప్రజలను మత్తులో ముంచెత్తి వారి ఓట్లను కొల్లగొట్టేందుకు సంసిద్ధమై వున్నారు.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరగనున్న పంచాయతీ ఎన్నికలలో ప్రజలను వివిధ రకాలుగా దిగజార్చే, చీల్చే పాలకవర్గ పార్టీల కుట్రలకు బలికాకుండా ప్రజలంతా ఐక్యంగా నిలవాలని సిపిఐ(ఎం-ఎల్) పిలుపునిస్తున్నది. గ్రామీణ ప్రాంతంలో కీలకంగానున్న భూమిసమస్య పరిష్కారంకోసం, గ్రామీణ వనరులపై ఆధిపత్యంకోసం, అగ్రకుల పెత్తందార్ల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భూమిహీనులైన వ్యవసాయకూలీలు, గ్రామీణపేదలు, కష్టజీవులంతా సంఘటిత ఐక్యపోరాటాలు సాగించాలి. పంచాయతీ ఎన్నికలలో - వ్యవసాయ కూలీలు, దళితులు, సన్న - చిన్నకారు, మధ్యతరగతి రైతాంగంతో పాటు గ్రామీణపేదలు, కష్టజీవులంతా ఐక్యంగా నిలబడి తమ డిమాండ్ల పరిష్కారానికి కలిసివచ్చే, మద్దతిచ్చే అభ్యర్థులను గెలిపించాలని; అగ్రకుల, భూస్వామ్యవర్గ దోపిడీ ప్రయోజనాల కొమ్ముగాసే, పేదలలో చీలికలు సృష్టించే కుట్రలను సమైక్యంగా ఎదుర్కొని, త్రిప్పికొట్టాలని సిపిఐ(ఎం-ఎల్) పిలుపునిస్తున్నది.

- ★ **భూస్వాముల మిగులుభూములు, బంజరు, దేవాలయ భూములను గ్రామీణ పేదలకు పంచాలి.**
- ★ **వ్యవసాయ కూలీలకు, గ్రామీణ యువతకు ఉపాధి గ్యారంటీ చేయాలి.**
- ★ **రైతులందరికీ ప్రభుత్వమే పంటరుణాలు కల్పించాలి.**
- ★ **పంటలకు గిట్టుబాటుధర కల్పించి దళారీ వ్యవస్థను రద్దుచేయాలి.**
- ★ **విత్తనాలు, ఎరువుల ధరలతోసహా నిత్యావసర వస్తువులన్నింటి ధరల పెరుగుదలను అరికట్టాలి.**
- ★ **నీటి ప్రైవేటీకరణను రద్దుచేయాలి; సాగునీటి సౌకర్యం, ఉచిత విద్యుత్తును సక్రమంగా అందించాలి.**
- ★ **ఆదివాసీ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, వైద్య సౌకర్యాలను మెరుగుపర్చాలి.**
- ★ **1/70, పీసా వంటి షెడ్యూల్డు ప్రాంత చట్టాలు అమలుచేయాలి.**
- ★ **సెజ్‌లు, పోర్టులు తదితర పేర్లతో సేకరించిన భూములన్నింటినీ వెంటనే తిరిగి రైతులకు అప్పగించాలి.**

**9-7-2013 రాష్ట్రకమిటి, సిపిఐ(ఎం-ఎల్)**

# గుజరాత్ ఇష్రత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ రాజ్యపు ఆమోదం, ప్రేరణలతో జరిగిన పోలీసు హత్య

**2004** జూన్15న, గుజరాత్‌లోని అహ్మదాబాద్-గాంధీనగర్‌ల మధ్య నిర్మానుష్యంగావున్న రహదారిపై ముంబయికి చెందిన ఇష్రత్ జహాన్ అనే 19ఏళ్ళ విద్యార్థినితోపాటు, జావేద్‌షేక్, అమ్జాద్ ఆలీరానా, జీషాన్ జోహార్ అనే వివిధ ప్రాంతాల నుండి విడివిడిగా తెచ్చిన యువకులను పోలీసులు కాల్చిచంపారు. వీళ్ళందరూ లష్కర్-ఎ-తోయిబా అన్న తీవ్రవాద సంస్థతో సంబంధాలు కలిగివున్నారనీ, వీళ్ళు గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీని హత్యచేయటానికి, గుజరాత్‌లో బీభత్సం సృష్టించటానికీ వచ్చారనీ, ఈ విషయాన్ని పసిగట్టిన తాము, వారిని పట్టుకోబోగా వాళ్ళు కాల్పులు జరపటంతో, తాము జరిపిన ఎన్‌కౌంటర్‌లో (ఎదురు బొదురు కాల్పుల్లో) వారు మరణించారనీ పోలీసులు ప్రకటించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసు అధికారులకు నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రమోషన్లు యిచ్చి, వారు కోరిన చోట్లకు బదిలీచేసి సత్కరించింది.

కానీ ముంబయికి చెందిన ఇష్రత్ జహాన్ యొక్క తల్లీ, కేరళకు చెందిన జావేద్ షేక్ యొక్క తల్లిదండ్రులూ, తమ బిడ్డలు ఎన్‌కౌంటర్లో చనిపోలేదనీ, పోలీసులే అన్యాయంగా, అక్రమంగా తమ బిడ్డలను పట్టుకొని కాల్చిచంపేశారనీ, ఈ విషయంలో తమకు న్యాయం చేకూర్చమనీ గుజరాత్ హైకోర్టులో పిటీషన్ పెట్టుకొన్నారు.

గుజరాత్ హైకోర్టు ఈ వ్యవహారంపై నిజానిజాలు తేల్చటం కోసం విచారణకు పూనుకుంది. మూడు రకాల విచారణలకు గుజరాత్ హైకోర్టు ఆదేశించింది.

మొట్టమొదటగా, ఈ విషయంపై, అహ్మదాబాద్‌లోని మెట్రోపాలిటన్ కోర్టు తొలి విచారణను జరిపింది. తన విచారణ రిపోర్టును 2009లో హైకోర్టుకు సమర్పించింది. ఇష్రత్ జహాన్, జావేద్ షేక్ పిళ్ళై తదితరులు ఎన్‌కౌంటరులో చనిపోలేదనీ, అది ఒట్టి బూటకపు ఎన్‌కౌంటరు మాత్రమేననీ తేల్చి చెప్పింది. చంపబడ్డ నలుగురికీ ఉగ్రవాదులతో సంబంధం వుందని తెలియజేసే సాక్ష్యాధారాలు ఏమీలేవనీ, నరేంద్రమోడీని వాళ్ళు చంపటానికి వచ్చారన్నది పోలీసుల కట్టుకథేనని కూడా చెప్పింది. కాల్పులకు కారకులైన పోలీసు అధికారులపై హత్యానేరం మోపి విచారించమని సిఫార్సు చేసింది.

తిరిగి యిదే అంశంపై, గుజరాత్ హైకోర్టు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళి కేసును శోధించింది. గుజరాత్ రాష్ట్ర పోలీసు అధికారులు తమకు సహాయం యివ్వకపోగా, కల్పించిన అనేక ఆటంకాలను తప్పించుకొని కర్నేల్‌సింగ్ నాయకత్వంలో వున్న సిట్ బృందం, క్షుణ్ణంగా పరిశోధించి అది బూటకపు ఎన్‌కౌంటరేనని 2011లో గుజరాత్ హైకోర్టుకు నివేదిక యిచ్చింది.

దీనిపై స్పందించిన గుజరాత్ హైకోర్టు ఎన్‌కౌంటర్‌పేరిట కాల్పులకు పాల్పడి, ఆ నలుగురినీ చంపిన పోలీసులపై హత్యానేరం మోపి విచారణ చేపట్టాలని ఆదేశించింది. పూర్తి సాక్ష్యాధారాలను సేకరించాల్సిందిగా, వాటిపై ఆధారపడి ఛార్జిషీటు దాఖలు చేయాల్సిందిగా ఆదేశిస్తూ, కేసును సి.బి.ఐ.కి అప్పగించింది. సాక్ష్యాధారాలను సేకరించిన సి.బి.ఐ, నాడు జరిగింది. బూటకపు ఎన్‌కౌంటరేనని తేల్చి చెప్పటంతోపాటు, ఎనిమిదిమంది గుజరాత్ పోలీసు ఉన్నతాధికారులను దోషులుగా పేర్కొంటూ 2013 జూన్4వ తేదీన చార్జిషీటు పెట్టింది. చంపబడ్డ నలుగురూ ఉగ్రవాదులు ఎంతమాత్రమూకారనీ, వారిని విడివిడిగా పట్టుకొని తీసుకువెళ్ళి, వాళ్ళపై అబద్ధపు ఆరోపణలు, నేరపూరిత ఉద్దేశాలనూ మోపి పోలీసులు వాళ్ళని కాల్చిచంపారని తేల్చి చెప్పింది. ఇందులో ఐ.బి. (ఇంటెలిజెన్సు బ్యూరో)కు చెందిన ఒక ఉన్నతాధికారి పాత్ర కూడా వుందని తేల్చి చెప్పింది.

ఇటువంటి ఛార్జిషీటును సి.బి.ఐ మోపిందన్న వార్తతో, దేశంలో మరొకసారి ఈ ఎన్‌కౌంటరు గురించి, దాని ఔచిత్యాన్ని గురించి చర్చపేరిట, పలువురు మేధావులనబడే వారి నుండి రకరకాల అభిప్రాయాలు మీడియాలో వెల్లడిచేయబడుతున్నాయి. ఈ అంశంపై, దేశంలోని రెండు ప్రధాన రాజకీయపార్టీలలో ఒకటి అయిన బి.జె.పి పార్టీ కూడా పెద్ద గొంతుతో తన అభిప్రాయాలను ప్రచారం చేస్తోంది.

ఇది తొమ్మిదేళ్ళక్రితం జరిగిన సంఘటన అనీ, అది కూడా టెర్రరిస్టు సంస్థ లష్కరే తోయిబా యొక్క అనుయాయులు గుజరాత్‌లో అల్లకల్లోలం సృష్టించి, గుజరాత్ ముఖ్యమంత్రిని హత్యచేయటానికి పథకం వేసిన వారిని ఎన్‌కౌంటర్ చేసిన ఘటన అనీ, టెర్రరిస్టు శక్తులను నాశనం చేసిన పోలీసు ఉన్నతాధికారులను ప్రశంసించటానికి బదులు కేసును తిరగతోడటమేమిటనీ, టెర్రరిస్టులపై యుద్ధం సాగించటంలో కానీ, వాళ్ళను శిక్షించడంలోకానీ యు.పి.ఏ పాలకులైన కాంగ్రెసుపార్టీ వారికి చిత్తశుద్ధిలేదనీ, 2014లో సాధారణ ఎన్నికల సందర్భంలో తాము నరేంద్రమోడీని ప్రధాని అభ్యర్థిగా ఎంచుకోబోతున్నాం కాబట్టి దుర్బుద్ధితో, మోడీని బదనాం చేసి ఎన్నికల్లో లాభం పొందటానికి యిది యు.పి.ఏ, కాంగ్రెసు పాలకులు పన్నిన కుయుక్తి అనీ, ఎన్‌కౌంటర్లో చంపబడ్డ వ్యక్తులు టెర్రరిస్టులు అన్న అంశాన్ని విస్మరించరాదనీ వాదిస్తూ, నాటి ఎన్‌కౌంటరు బూటకమైనాసరే, అందులో చంపబడ్డవారు టెర్రరిస్టులు కనుక ఆ విషయం పట్టించుకోకూడదు అని వాదిస్తోంది.

మరోవైపు గుజరాత్ ఐ.బి.కి, యిటువంటి బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగిన కాలంలో, ఉన్నతాధికారులుగా పనిచేసిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నర్సింహన్ లాంటి వాళ్ళు ఈ కేసులో మాదిరి సి.బి.ఐ, తన సోదర దర్యాప్తు సంస్థ అయిన ఐ.బి.పై ఆరోపణలు చేయటం వలన దర్యాప్తు సంస్థల్లోని అధికారుల, రక్షణ బలగాల మనోస్థైర్యం దెబ్బతింటుందనీ, ఫలితంగా వాళ్ళు సమర్ధవంతంగా పనిచేయలేరనీ, టెర్రరిస్టు ప్రమాదాన్ని అరికట్టలేరని వాదిస్తూ, ప్రధానమంత్రికి లేఖలు రాస్తూ, అసలు విషయమైన బూటకపు ఎన్‌కౌంటర్లపై చర్చను ఉద్దేశపూర్వకంగానే ప్రక్కదారి పట్టిస్తున్నారు.

మరికొందరు మేధావులు బూటకపు ఎన్‌కౌంటర్లు అన్యాయమేనంటూ నక్సలైట్ల, టెర్రరిస్టుల దుర్మార్గాన్ని గురించి వల్లెవేస్తూ, యిటువంటి సందర్భాలలో ఖచ్చితంగా సరయిన ఎన్‌కౌంటర్లనే చేయటం పోలీసులకు, రక్షణ దళాలకూ సాధ్యం కాకపోవచ్చునీ, అందువలన యిటువంటి సందర్భాల్లో, బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపిన పోలీసు వున్నతాధికారులకు మినహాయింపు యివ్వటంలో తప్పేమీ ఉండదంటూ సన్నాయినొక్కులు నొక్కుతున్నారు.

ఈ రకంగా చర్చ అన్నది అసలు విషయాన్ని ప్రక్కదారి పట్టించి, అనవసర విషయాలపై ఎక్కువగా జరుగుతోంది.

ఈ కేసులో స్పష్టమయిన సాక్ష్యాధారాలు లభ్యమవుతున్నా వీటిని నిర్లక్ష్యంచేస్తూ, యిటువంటి అసంబద్ధ చర్చను మీడియా ప్రోత్సహిస్తుంది అని చెప్పటం అతిశయోక్తి కాదు. అంతేకాదు మీడియా స్వయంగానే, ఐ.బి. యిచ్చిన సమాచారంపేరిట, పోలీసులచేత చంపబడ్డ ఆ నలుగురూ టెర్రరిస్టులేననే ప్రజాభిప్రాయాన్ని కలిగించే వార్తలను యీ సందర్భంగా ప్రచారం చేస్తోంది. ఇష్రత్ జహాన్ ఒక మానవబాంబు టెర్రరిస్టు అని హెడ్లీ చెప్పినట్లుగా (అమెరికాలోని దర్యాప్తు అధికారులకు) ఒక వార్తను చాకచక్యంగా ప్రచారంలో పెట్టోంది. బహుశా ఐ.బి. అధికార్ల ఆదేశాలతోనే, ఆ సంస్థకు చెందిన ఈ కేసులో దోషులైన అధికారులు నేరం చేయలేదన్న అభిప్రాయం కోసం యిలాచేస్తూ వుండవచ్చును.

అయినప్పటికీ ఈ కేసులో ఈ క్రింది విషయాలు స్పష్టంగా వున్నాయి. అవి :

1. ఈ కేసులో సి.బి.ఐని దర్యాప్తుచేసి, సాక్ష్యాధారాలతో ఛార్జిషీటు పెట్టమన్నది, గుజరాత్ హైకోర్టేకానీ, యు.పి.ఏ పాలకులైన కాంగ్రెసుపార్టీ కాదు.
2. సి.బి.ఐ ఛార్జిషీటు ద్వారా తన వివరాలను వెల్లడించకముందే, అంతకుముందు యిదే విషయంపై విచారణ, దర్యాప్తులను జరిపిన అలహాబాద్ మెట్రోపాలిటన్ కోర్టు, సిట్‌లు అది బూటకపు ఎన్‌కౌంటరు అనీ, అందులో చంపబడ్డ వ్యక్తులు ఉగ్రవాదులు అనటానికి గానీ, వాళ్ళు మోడీని హత్యచేయటానికి వచ్చారనికానీ ఎటువంటి సాక్ష్యాధారాలూ లేవని తేల్చిచెప్పాయి.
3. ఈ బూటకపు ఎన్‌కౌంటర్ చేయటానికి ముందే, ఐ.బి. వున్నతాధికారుల సంభాషణల్లో, రాజేంద్ర కుమార్ అనే ఉన్నతాధికారితో వంజర అనే గుజరాత్ డి.జి.పీ, ఈ ఎన్‌కౌంటర్ చేయటానికి 'రాజకీయ యజమానుల అనుమతి' లభించిందని చెప్పినట్టు, రికార్డు అయిన సాక్ష్యాధారాలున్నట్లు తెహల్కాపత్రిక తెలియచేస్తోంది.
4. వంజర అలా చెప్పినప్పటికీ, ఈ ఎన్‌కౌంటరు చేసే సంకల్పానికి, పైన పేర్కొన సంభాషణల్లో పాల్గొన్న సింఘాల్ అనే పోలీసు ఉన్నతాధికారి అభ్యంతరం చెప్పాడు.
5. పోలీసు అధికారులు ఆ నలుగురిపై కాల్పులు జరపమని ఆదేశించినప్పుడు, అందుకు మోహన్‌నుంజీ, జి.కె.చౌహాన్ అనే పోలీసు అధికారులు నిరాకరించటంతో, వాళ్ళ నుండి ఆయుధాలు లాక్కొని యితర పోలీసు అధికారులు కాల్పులు జరిపారు.
6. అంతేకాక, యీ బూటకపు ఎన్‌కౌంటరు జరిపిన పోలీసు అధికారులు, పోలీసులకు చెందిన ఐ.బి.ద్వారా సేకరించిన మారణాయుధాలనే, చనిపోయిన వ్యక్తుల శవాల దగ్గరపెట్టి, అవి చనిపోయిన వాళ్ళవని అబద్ధం చెప్పారు.
7. ఈ కేసులో నిందితులైన కొందరు పోలీసు అధికారులు, ఇంతకుముందే బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగాయని రుజువైన కేసుల్లో శిక్షననుభవిస్తున్నారు.
8. ఎన్.ఐ.ఎ. అనే దర్యాప్తు సంస్థ తమకు ఇష్రత్ గురించి హెడ్లీ చెప్పిన విషయాలు కేవలం గాలి వార్తలయిన వినికిడి సాక్ష్యాలే తప్ప సిసలైన రుజువులు కావనీ, ఇష్రత్ జహాన్‌కు, ఎల్.ఇ.టి. టెర్రరిస్టులతో సంబంధం వుందని చెప్పటానికి రుజువులు, సాక్ష్యులూ ఏమీలేవని నిర్ద్వంద్వంగా స్పష్టంచేస్తూ, వ్రాతపూర్వకంగా హోంమంత్రిత్వ శాఖకు తెలియచేసింది.

ఇన్ని స్పష్టమయిన వివరాలు మనముందుంటే, అది బూటకపు ఎన్‌కౌంటరుకాదనీ, అందులో మరణించిన వాళ్ళు టెర్రరిస్టులనీ వాదించటం అంటే, దానర్థం బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపి ప్రజలను చంపేసినా, అది సమంజసమైనదేనంటూ సమర్ధించటం కాక మరేమవుతుంది.

నిజమే! ఈ అంశాన్ని రాజకీయం చేసి కాంగ్రెసు, బి.జె.పి పార్టీలు, 2014 సాధారణ ఎన్నికల్లో లబ్ధి పొందటానికి రకరకాల ప్రచారాలు, జిమ్మిక్కులు అపసవ్యవాదనలూ చేయవచ్చు. అంతమాత్రాన టెర్రరిస్టులనో, నక్సలైట్లనో పోలీసులు యిష్టారాజ్యంగా చంపివేయటాన్ని దేశప్రజలు అంగీకరించాలా? ఇదేనా పదే, పదే అనునిత్యం ప్రచారం చేయబడే "ప్రజాస్వామ్యం" అన్నదాని అర్థం? మనదేశానికో రాజ్యాంగమూ, న్యాయవ్యవస్థా వున్నాయనీ, అవి ప్రజల హక్కులకు రక్షణ కల్పిస్తాయనీ, ప్రజలందరికీ నిష్పాక్షిక న్యాయం అందిస్తాయనీ, ఈ 64సంవత్సరాలుగా నమ్మబలుకుతున్న మాటలకు, ఆచరణలో అర్థం యిదేననుకోవాలా? నిజంగా మనదేశంలో జరుగుతున్నదేమిటి? ఇవన్నీ ఆలోచించాల్సిన అంశాలు.

ప్రముఖ పాత్రికేయుడు, రాజనీతిజ్ఞుడూ, ఎమర్జన్సీకి వ్యతిరేకంగా పోరాడిన యోధుడిగా పరిగణించబడే కులదీప్‌నయ్యర్ అన్నట్లు "నిజంగా ఇష్రత్ జహానూ, యితరులూటెర్రరిస్టులే అనుకొందాం. అప్పుడు, వాళ్ళు టెర్రరిస్టులని ఏ న్యాయస్థానంలో నిరూపించకుండా, వాళ్ళని చంపేహక్కు పోలీసుల కుందా?" అన్నది యోచించాల్సిన ప్రశ్న. ఆయన ఈ సందర్భంగా చెప్పినట్లుగానే "ఈ రోజున దేశంలోని ప్రజలు నిజాయితీ లేకపోవటం, వంచన చేయటం అన్నదే రాజకీయాలు అన్నదానికి పర్యాయపదం అని నమ్మాల్సిన పరిస్థితులకు నెట్టబడ్డారు."

సరిగ్గా ఆయన చెప్పినట్లుగానే భారత పాలకులు గత 64 సంవత్సరాలుగా నిజాయితీ లేకుండా ప్రజల్ని అనేక విషయాల్లో వంచన చేస్తున్నారు. అదేవిధంగా ఈ 'ఎన్‌కౌంటర్లు' అనబడే విషయంలో కూడా ప్రజలకు అబద్ధాలు చెపుతూ వంచన చేస్తున్నారు. తమపాలనకు ఎదురుతిరిగి, ప్రశ్నార్థకంగా తయారయినవారిని, ఏదోఒక పేరు చెప్పి, ఏదో ఒక మిషతో పోలీసులచేత చంపించటం అనే దాన్ని ఒక విధానంగా అమలుచేస్తున్నారు. ఇందుకు ఏ రాజకీయపార్టీవారూ మినహాయింపుకాదు. రాజ్యాధికారంలోవున్న సందర్భంలో అన్ని పార్టీలవారూ యిటువంటి బూటకపు ఎన్‌కౌంటర్లు చేయించి, వాటిని ప్రోత్సహించి, ప్రజలను దుర్మార్గంగా పోలీసు, సైన్యం, పారామిలటరీ దళాలవారి కాల్పులకు గురిచేసి చంపించినవారే. ఈ ఎన్‌కౌంటర్ల చరిత్ర మొత్తం చూస్తే "ఎన్‌కౌంటర్లు అన్నీ పోలీసుహత్యలే, అన్నీ రాజకీయ బాస్‌ల ఆమోదంతో జరిగినవే"నని అర్థమవుతుంది.

ఈ ఎన్‌కౌంటర్ల యొక్క దుర్మార్గం మొట్ట మొదటిసారిగా, సి.పి.ఐ నాయకుడు అచ్యుత్‌మీనన్ ముఖ్యమంత్రిగా వున్న రోజుల్లో, కున్నిక్కల్ నారాయణ్ గ్రూపుకు చెందిన, కున్నిక్కలైట్ నాయకుడైన ఎ.వర్గీస్‌ను పోలీసులు 1970 ఫిబ్రవరి 18 ఉదయం అరెస్టుచేసి తీసికెళ్ళి, ఆ సాయంత్రం అతడ్ని బూటకపు ఎన్‌కౌంటరులో కాల్చిచంపారు. ఈ ఘటనపై విచారణ జరిపించమన్న ప్రజల, పత్రికల డిమాండును కూడా, ఆ ముఖ్యమంత్రి పాలనలోని ప్రభుత్వం తిరస్కరించింది.

ఐతే 35 సంవత్సరాల అనంతరం, ఆ 'ఎన్‌కౌంటర్'లో పాల్గొన్న యిద్దరు పోలీసులే 40 సంవత్సరాల తర్వాత తాము బూటకపు ఎన్‌కౌంటరులో, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నిరాయుధుడూ, బందీగా వున్న వర్గీసును సూటిగా తుపాకులతో కాల్చిచంపాం అని కోర్టులో వాంగ్మూలం యివ్వటంతో, యీ ఎన్‌కౌంటర్ల బూటకం బట్టబయలైంది. ఇది రాజ్యం అమలుజరుపుతున్న పోలీసు హత్యలే అని రుజువైంది.

ఆ తర్వాత యిటువంటి బీభత్సకాండకూ, బూటకపు ఎన్‌కౌంటర్లకూ, పోలీసు హత్యలకూ సిద్ధాంతశంకర్‌రే ప్రభుత్వ కాలంలో పశ్చిమబెంగాల్ కేంద్రమయింది. ఎందరో అమాయకులను నక్సలైట్ల పేరిట అరెస్టుచేసి బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి కాల్చిచంపారు. ఆఖరుకు జైల్లో వున్న ఖైదీలను కూడా, వాళ్ళు ఎదురుతిరిగారనే సాకుతో నిర్దాక్షిణ్యంగా చంపేయటం జరిగింది.

ఈరకంగా 1970 నుండే బూటకపు ఎన్‌కౌంటర్లు జరపటం అనేది దేశంలో ఒక మామూలు విధానం అయిపోయింది.

1969-70లలో పోలీసులు, అనేకమంది విప్లవకారులనూ, విప్లవకారిణిలనూ ఎన్నో బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపి రాజ్యం యొక్క ఆమోదంతోనే హత్యలు జరిపే యిటువంటి బూటకపు ఎన్‌కౌంటర్ల బాటను, యితరులకు చూపించింది-ఆంధ్రా పోలీసులే. కామ్రేడ్స్ పంచాది నిర్మల, అంకమ్మ, సరస్వతమ్మ, సుబ్బారావు పాణిగ్రాహి, గణపతి, పంచాది కృష్ణమూర్తి, డాక్టర్ భాస్కరరావు, వెంపటాపు సత్యం తదితరులు అనేకమందిని పోలీసులు ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌లలో హత్యచేశారు. ఈరకంగా యీ బూటకపు ఎన్‌కౌంటర్లు కేవలం కమ్యూనిస్టు విప్లవకారులూ, నక్సలైట్లమీదే జరుపుతారని భ్రమపడ్డ దేశప్రజానీకాన్ని ఈరోజున 'ఎవరినైనా బూటకపు ఎన్‌కౌంటర్లో పోలీసులు చంపేయగలరు' అని అర్థం చేసుకొనేటట్లు చేయగలిగారు.

ఈ బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలకు దేశంలోని ప్రజలనుండి రావల్సినంత వ్యతిరేకతా, చూపించాల్సినంత నిరసనా వ్యక్తం కాకపోవటంతో పాలకులకూ, పోలీసులకూ అడ్డు, అదుపూ లేకుండా పోయింది. తమకు వ్యతిరేకులైన ప్రత్యర్థుల్ని చంపేయటానికి ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపించటం, జరపటం అన్నది ఒక సాధారణ విధానంగా మారిపోయింది. రాజ్యం యొక్క ఆదేశ, ఆమోదాలతో, ప్రోత్సాహంతో ఈ ఎన్‌కౌంటర్లు జరపటంలో 'స్పెషలిస్టులు' కూడా తయారయ్యారు.

ముంబయిలో ప్రదీప్‌శర్మ అనే ఒక పోలీసు అధికారి 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు' అట! ఇతడు 100కి పైగానే ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నాడట.

2006 నవంబర్ 11న, ఛోటారాజన్ అనబడే మాఫియా నాయకుడికి అనుచరుడైన రామాయణగుప్తా అనే వ్యక్తిని 'ఎన్‌కౌంటరు'లో (బూటకపు) చంపివేశారు. అతడితో పాటు అరెస్టుచేయబడ్డ అమీర్‌బాషా అన్న వ్యక్తిని, సాక్ష్యం చెపుతాడన్న కారణాన అదృశ్యం చేశారు. తర్వాత అతను చంపబడి శవమై కన్పించాడు. ఈ ఎన్‌కౌంటరు జరిపింది ప్రదీప్‌శర్మేనట!

అలాగే ప్రస్తుత ఇష్రత్ జహాన్ ఎన్‌కౌంటరు జరిపిన డి.జి.పి వంజర కూడా ఎన్‌కౌంటరు స్పెషలిస్టేనట!

చండీఘడ్‌కు చెందిన సూర్జిత్‌సింగ్ అనే పోలీసు సబ్‌యిన్‌స్పెక్టర్ తాను, పి.ఎస్.గిల్ పోలీసు ఉన్నతాధికారిగా వున్న రోజుల్లో ఎన్నో బూటకపు ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నాననీ, 80మందిని వాటిలో చంపేశాననీ, 16ఎన్‌కౌంటర్ల వివరాలను వెల్లడించాడు. అతడు 1989లో కానిస్టేబుల్‌గా చేరాడు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లలో వాడుకోవటం ఎస్.ఐ.ని చేసినా, రికార్డుల్లో అతడిని కానిస్టేబుల్‌గానే చూపించారు. కాకపోతే అతడికి వేరేమార్గంలో పారితోషికాలనూ, ప్రోత్సాహకాలను చెల్లించారట!

ఆ మధ్యన ఒక పోలీసు, ఎన్‌కౌంటరు కేసులో కోర్టులో వాంగ్మూలమిస్తూ, తాము ఒక మాఫియాకు చెందిన వ్యక్తిని, ప్రత్యర్థి మాఫియానుండి భారీమొత్తాలు తీసుకొని ఎన్‌కౌంటరు చేసినట్టుగా చెప్పాడు.

1980 కాలంలో టెర్రరిస్టులపై పోరాటం పేరిట ఎంతోమంది అమాయకులను, పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చిచంపారు.

ఇక కాశ్మీర్‌లోనూ, ఈశాన్యరాష్ట్రాలైన మణిపూర్, అస్సాంలలోనూ పారామిలటరీ దళాలూ, సైన్యం జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలకు అంతే లేకుండా పోయింది. ప్రత్యేకాధికారాల చట్టం యిచ్చిన అధికారంతో యిటువంటి బూటకపు ఎన్‌కౌంటర్లు ఎన్నో జరిగాయి.

ఆ మధ్యన తమిళనాడులో ఒక 'బందిపోటు' దొంగను పోలీసులు ఎన్‌కౌంటరులో చంపేశారు.

ఇక ఈ బూటకపు ఎన్‌కౌంటర్లను నేర్పిన ఆంధ్రప్రదేశ్ అయితే, సీతారామాంజనేయులు అనే ఒక పోలీసున్నతాధికారే 2002-03 కాలంలో కర్నూలు, గుంటూరు జిల్లాల్లో 16 బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపి అమాయకులను **(తరువాయి 7వ పేజీలో)**

# కార్పొరేటు, ప్రైవేటు వృత్తి-ఇంజనీరింగు సంస్థల విద్యా వ్యాపారానికి గేట్లు బార్లా తెరుస్తున్న ప్రభుత్వ విధానాలు

**మనదేశంలో**, రాష్ట్రంలో విద్య అందరికీ అందుబాటులో లేకపోవటం; దేశ పరిస్థితులకు అనుగుణంగా లేకపోవటం; సమాజ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేదిగా లేకపోవడం-సారాంశంలో అశాస్త్రీయంగా ఉండటమనే అంశాలను కొద్దిసేపు ప్రక్కనుంచినప్పటికీ, ప్రభుత్వాలు తాము నేర్పదలచుకున్న చదువులనైనా విద్యార్థులకందించకుండా గాలికొదిలేసి, కార్పొరేటు గుత్తసంస్థల విద్యావ్యాపారాన్ని దినదినాభివృద్ధి గావిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి.

ప్రస్తుతం-మన రాష్ట్రంలో పదవతరగతి పూర్తయిన, ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థుల తాజా అవస్థలే ఇందుకు నిదర్శనంగా వున్నాయి.

## కార్పొరేటు విద్యాసంస్థల అవాస్తవ ప్రచారహోరు

పన్నెండులక్షల మంది విద్యార్థులకు పదవతరగతి పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం గత సంవత్సరం నుండీ 'మార్కులు' ప్రకటించటం గాకుండా 'గ్రేడ్లు' ప్రకటించే విధానాన్ని అనుసరిస్తూ వస్తోంది. పిల్లలను ప్రభావితం చేసే కార్పొరేటు విద్యాసంస్థల మోసపూరిత ప్రచారాన్ని అరికట్టి ముఖ్యంగా పిల్లలపై వత్తిడిని తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ గ్రేడ్ల విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఘనంగా ప్రకటించుకుంటోంది. కాగా తమ విద్యాసంస్థ నుండి ఎందరు పదవతరగతి పరీక్షకు హాజరైతే, ఎందరికి 'పదికి పది' గ్రేడు వచ్చిందనే అంశాన్ని మరుగుపరచి, అత్యధిక 'ఏ-వన్' గ్రేడ్లను సాధించిన సంస్థ తమదంటే తమదేననే ప్రచార సునామీతో కార్పొరేటు సంస్థలు హోరెత్తిస్తున్నా ప్రభుత్వం దానినేమీ అడ్డుకోవాలనుకోవటంలేదు.

పదవతరగతి పరీక్షల ప్రారంభానికి ముందునుండీ, పరీక్షలు పూర్తయ్యి ఫలితాలు ఇంకా వెలువడక ముందే, ఇక ఫలితాలు వెలువడినాక - మెరుగైన గ్రేడుపాయింట్లు సాధించిన వారి ఇండ్ల వద్దకు ఈ కార్పొరేటు కాలేజీలలోని అధ్యాపకులో లేదా ఉద్యోగులో వెళ్ళి తమ తమ కాలేజీలలో వారిని చేర్చుకోవటానికి పదే పదే వెంటబడి, అడ్వాన్సు బుకింగ్ ఆఫర్లంటూ, ఫీజురాయితీలంటూ కల్లబొల్లి కబుర్లతో ప్రలోభాలకు గురిచేసి అనేకమందిని 'కమిట్' చేయించుకుంటున్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల అవస్థలు

మరోవైపున ప్రభుత్వ పాఠశాలల్లో పదవతరగతి పూర్తిచేసుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లేదా ఎయిడెడ్ కళాశాలల్లో చేరిన విద్యార్థులు చేదు అనుభవాలనెదుర్కొంటున్నారు. సరైన వసతులు లేకపోవటంతోపాటు పర్మినెంటు లెక్చరర్లులేకపోవటం; కాంట్రాక్టు లెక్చరర్లు తమను పర్మినెంటు చేయాలనే వారి న్యాయమైన డిమాండ్తో నిరవధిక సమ్మెజేస్తూండటంతో కళాశాలలు ప్రారంభమై నెలరోజులవుతున్నా విద్యాబోధన ప్రారంభం కాక వారంతా ప్రైవేటు, కార్పొరేటు కాలేజీలవైపు నెట్టబడుతున్నారు.

ప్రభుత్వ, మునిసిపల్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పదవతరగతిలో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాలనే టార్గెట్లుపెట్టి మరీ విద్యాశాఖ అధికారులు -ఉపాధ్యాయులు, విద్యార్థులపై వత్తిడి పెంచారు. ఏమైనా, కార్పొరేటు కళాశాలలకు ధీటుగా, అరకొరగానున్న సౌకర్యాలతోనైనా ప్రభుత్వ, మునిసిపల్ మరియు ప్రభుత్వ గురుకుల పాఠశాలల విద్యార్థులు పదవతరగతి పరీక్షాఫలితాలలో అధికశాతం ఉత్తీర్ణులవటంతోపాటు మెరుగైన 'గ్రేడ్లు' కూడా సాధించారు.

మెరుగైన 'గ్రేడు' సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం కల్పించి, నాణ్యతగల విద్యనందిస్తామనే భరోసా కల్పించాల్సింది పోయి, సిగ్గువిడిచిన ప్రభుత్వం-ఈ విద్యార్థులను సైతం కార్పొరేటు కళాశాలలకప్పగించి, వారు నిర్దేశించిన ఫీజును తాను చెల్లిస్తానంటున్నది! (ఇది కూడా సక్రమంగా అమలుచేయకపోవటంతో, ఇంటర్ రెండవ సంవత్సరం లోనే అనేకమంది విద్యార్థులు ఆయా కార్పొరేటు సంస్థలు నిర్దేశించిన ఫీజును చెల్లించలేక బయటపడ్తున్నారు)

## గుత్త కార్పొరేటు విద్యాసంస్థల నిలువుదోపిడీ

శ్రీచైతన్య, నారాయణ వంటి కార్పొరేటు సంస్థలు పోటీబడి మరీ చిన్న, చిన్న ప్రైవేటు విద్యాసంస్థలను, కళాశాలలను పథకం ప్రకారం దివాలా తీయించాయి. ఆపై ఆ రెండూ చేతులు కలిపి సిండికేటుగా మారి (చైనా) గుత్తసంస్థగా రూపాంతరం చెంది విద్యార్థులను నిలువుదోపిడీ చేస్తున్నాయి. ప్రభుత్వ వ్యవస్థకు సమాంతర వ్యవస్థగా విద్యార్థులను చేర్చుకుంటున్న వీరి దోపిడీ గతకాలం నుండీ సాగుతూ వస్తున్నా, ఈ సంవత్సరం అది మరింత తీవ్రమైంది. మొత్తంగా ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యతో పోల్చితే ఉద్యోగావకాశాలు చాలా తక్కువగా వుండటం; మంచి ర్యాంకులు పొందినవారికే 'అన్ని అవకాశాలు' అనే ప్రచార ప్రభావానికిలోనైన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల బలమైన ఆకాంక్షలను ఈ గుత్త కార్పొరేటు విద్యాసంస్థలు సొమ్ముజేసుకుంటున్నాయి. విద్యను వ్యాపారంగా సాగించటమేగాక, నీచమైన పద్ధతులనునరించటానికి కూడా ఇవి వెనకాడటంలేదు.

ఒక దశలో ఎంపిసి, బైపిసి విద్యార్థులపైనే ఈ కార్పొరేటు విద్యాసంస్థల దృష్టి వుండేది. చిన్న చిన్న ప్రైవేటు సంస్థలు ఎంఇసి తదితర గ్రూపులను బోధన చేసేవి. నూతన ఆర్థిక విధానాలతో దేశంలో ఉద్యోగావకాశాలు బాగా పెరిగాయని, అందులోనూ రానున్న కాలంలో లక్షలమంది సి.ఏ.ల అవసర ముందంటూ ఈ గుత్త విద్యాసంస్థలు ఊదరగొడ్తూ సెమినార్లు, సదస్సులు నిర్వహించి తమ ప్రచారాన్ని తీవ్రం చేశాయి. తద్వారా సామాజిక, ఆర్థిక శాస్త్రాలు బోధించే చిన్న చిన్న సంస్థలను కూడా ఈ బడా సంస్థలే దురాక్రమించాయి. ఇంజనీరింగు విద్యలో ఏర్పడిన స్తబ్దతను కూడా సొమ్ముచేసుకుంటూ ఎంపిసి చదివిన విద్యార్థులే సి.ఏ.కోర్సుకు అర్హులనేంతగా కోట్ల రూపాయలు వెచ్చించి కొత్తగా మరో బూటకప్రచారాన్ని నిరాటంకంగా సాగిస్తున్నాయి; సి.ఏ. క్యాంపస్లను సృష్టించుకున్నాయి.

తమ కళాశాలల్లో విద్యార్థులను చేర్పినందుకు 'కమీషన్' పద్ధతులు; విద్యార్థులు చేరే సమయంలో సౌకర్యవంతమైన క్యాంపస్ చూపించి, తదనంతరం మరో ఇరుకైన క్యాంపస్లో వారిని కుక్కటం; ఒకే కోర్సుకు ఒకే సంస్థలో తమ చిత్తమొచ్చినట్లుగా వివిధ రకాల ఫీజు దొంతర్లను నిర్ణయించి 'వచ్చిన దగ్గర వచ్చిన కాడికి' పిండుకునే దారిదోపిడీ విధానాలను సాగిస్తున్నాయి. ఏ.సి.క్యాంపస్లు, డే-స్కాలర్ క్యాంపస్లు, రెసిడెన్షియల్ క్యాంపస్లు, లాంగ్టరమ్ క్యాంపస్లు, ఐఐటి ఫౌండేషన్ క్యాంపస్లు... ఇలా డబ్బు చెల్లింపు ప్రాతిపదికగా విద్యార్థులను వివిధ దొంతర్లుగా విభజించి, నవయవ్వన దశలోనే విద్యార్థుల సున్నిత భావాలను కర్కశంగా చిదిమి వేస్తున్నాయి.

## 'కార్పొరేటు సామాజిక బాధ్యత'

పై పెచ్చు ఈ గుత్త కార్పొరేటు సంస్థల యాజమాన్యం విద్యాసేవలో తామూ తరిస్తున్నట్లుగా ఫోజుపెడుతూ పదవతరగతిలో మెరుగైన గ్రేడు పాయింట్లు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను తమ తమ సంస్థలలో పోటీలుపడి మరీ చేర్చుకోవటానికి, కొన్ని సందర్భాలలో వారికి ఉచితంగా సీటు ఇవ్వటానికి కూడా వెనుకాడటం లేదు. ఇదంతా ఆ తర్వాత వారిచేసే మరింత 'రుబ్బించి' తమ ర్యాంకుల పంట పండించుకోవటం కోసమేననేది జగద్విదితమే!

## బలవన్మరణాలకు దారితీస్తున్న 'కార్పొరేట్ల' నీచమైన విధానాలు

ఈ కార్పొరేటు విద్యాసంస్థలలో, అగ్గిపెట్టెల వంటి గదులలో బోధనా ప్రమాణాలు అత్యంత నాసిగా ఉండటంతోపాటు, వేలాదిమంది విద్యార్థులున్న క్యాంపస్ లలో విడతలవారీగా సాగే వీరి వడపోత విధానంతో విద్యార్థులు తీవ్ర మానసిక వత్తిడికి గురౌతున్నారు. ఉదయం ఐదుగంటలకు లేచింది మొదలు, ఆరుగంటల నుండి రాత్రి పదిగంటల వరకు వారిచేత బట్టీయం కసరత్తులు చేయించటంతో విద్యార్థులు మానసికంగా అలసిపోయి తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. ఇంతేగాక, వీరి వడపోతలతో ఎప్పుడు మార్కులు తగ్గితే అప్పుడు వెంటనే ఆ విద్యార్థులను మరో సెక్షన్కు (స్లో లెర్నర్స్ పేరున) బదలాయించటమనే, అవమానాలకు గురిచేయటమనే వికృత చర్యలతో విద్యార్థులు తీవ్ర అభద్రతకు, మానసిక వత్తిడికి నిరంతరం లోనవుతున్నారు. దీనిని నిభాయించుకోలేని కొందరు బలవన్మరణాలకు పాల్పడటం కూడా 'ఈ కాన్సన్ట్రేషన్ క్యాంపులలో' మనం చూస్తూనే వున్నాం.

తప్పనిసరిగా ఉన్నత ర్యాంకులు వస్తాయని యాజమాన్యం, వారి నిపుణులైన మేధావులు భావించి, ఎంపిక చేసిన కొద్దిమంది విద్యార్థులను మిగతావారి నుండి వేరుజేసి, అధిక జీతాలు చెల్లించే నిష్ణాతులైన అధ్యాపకులతో, మెరుగైన శిక్షణనిప్పించటం-ఈ గుత్తకార్పొరేటు సంస్థలు అనుసరిస్తోన్న మరో నీచమైన విధానం. ఏదో ఒక రూపంలో ర్యాంకుసాధించటమే పరమావధిగా భావించే విద్యార్థి యొక్క మానసికస్థితిపై ఇది తీవ్రమైన చెడు ప్రభావాన్ని పడవేస్తోంది. కాగా, అదే సంస్థలో, అదే కోర్సు చదువుతున్న వేలాదిమంది మిగతా విద్యార్థులకు సాపేక్షంగా నైపుణ్య స్థాయి తక్కువగావున్న అధ్యాపకులతో (అతితక్కువ వేతనాలిచ్చి, అధిక పనిభారం మోపి) శిక్షణనిప్పించే వివక్షాపూరిత విధానం క్షమార్హమైనది కాదు.

పదవతరగతి పూర్తయి, ఇంటర్ విద్యలోకి వచ్చిన విద్యార్థుల శారీరక, మానసిక స్థాయి, సామర్థ్యాలు ఎదుగుదల కనుగుణంగా విద్యాబోధన ఉండవలసిన అవసరంతోపాటు వ్యాయామం, క్రీడలు, బోధనేతర సాంస్కృతిక కార్యకలాపాలు అవసరమని ప్రభుత్వమే నియమించిన ఎందరో నిపుణుల, విద్యావేత్తల, మానసిక శాస్త్రవేత్తల నివేదికలు ఘోషిస్తున్నాయి. అయినప్పటికీ ఈ గుత్తకార్పొరేటు సంస్థలు నిర్భయంగా ఆ సూచనలన్నింటినీ తుంగలోతొక్కివేశాయి. మరోవైపున అఖిలభారత స్థాయి ఐఐటిల వంటి సంస్థలలో ప్రవేశానికి అర్హమైన ర్యాంకులను అధికంగా సాధిస్తూ రాష్ట్రప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నామని, రాష్ట్రానికి తాము చాలా విద్యాసేవజేస్తున్నామని తమ జబ్బలు తామే చరుచుకుంటున్నాయి.

## కార్పొరేటు విద్యాసంస్థల మరింత ఎదుగుదలకు ప్రభుత్వ 'చేయూత'

ప్రభుత్వమే, ప్రభుత్వ విద్యను కునారిల్లచేసి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తానే స్వయంగా కార్పొరేటు సంస్థలకు కట్టబెడుతోంది. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పి, వారికి విద్యనందించటం గాకుండా, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థ 25శాతం పిల్లలను వారి సంస్థల్లో చేర్చుకోవాలనే షరతు విధించి, అందుకుగానూ ఆయా విద్యార్థుల ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తానంటోంది. ఈ విధానాలు కార్పొరేటు విద్యాసంస్థలు గుత్తసంస్థలుగా ఎదిగేందుకు, ప్రభుత్వ పాఠశాలలు నానాటికీ కృశించి పోయేందుకు మరింతగా దోహదపడుతున్నాయి.

పేదవాడికి ఒక రేషనుకార్డు నందించేందుకు సవాలక్ష వివరాలు కావాలంటూ, అర్థంలేని ప్రశ్నలతో వేధించే ప్రభుత్వాధికారులు, తమ కళ్ళముందే వేల కోట్ల రూపాయల విద్యావ్యాపారం నిరాటంకంగా సాగిపోతున్నా నిమ్మకునీరెత్తినట్లుంటున్నారు. ప్రైవేటు సంస్థలు చేర్చుకుంటున్న విద్యార్థుల సంఖ్యను నమోదు చేసుకొని, సంవత్సరాంతంలో వారికి పరీక్షలు నిర్వహించటం మినహా తమకు మిగతా అంశాలు వేటినీ తనిఖీచేసే, పర్యవేక్షించే అధికారం లేదని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తెగేసి చెబుతోన్నారు.

ఇంటర్ విద్యార్థులకు సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలు జంబ్లింగ్ పద్ధతిలో (విద్యార్థులు చదువుతున్న కళాశాలలో కాకుండా మరో కళాశాలలో) జరుగుతాయని పరీక్షల ప్రారంభానికి ముందుగా విద్యాశాఖామంత్రి నుండి ప్రతి సం॥రం ప్రకటన వెలువడుతూ వుంటుంది. కానీ, ఆ మంత్రిగారే కొద్దిరోజుల తర్వాత 'ఈ సంవత్సరానికి ప్రాక్టికల్స్ జంబ్లింగ్ విధానంలో జరగవు' అని మరో ప్రకటన చేస్తాడు. విషయం స్పష్టమే. మంత్రులు, అధికారులు ఆ స్థాయిలో గుత్తకార్పొరేటు విద్యాసంస్థల నుండి లంచాలు మేయటానికి అలవాటుపడివున్నారు. ఈ విధంగా ఈ సంస్థలు ఇంటరుబోర్డు స్థాయిలోనూ, సచివాలయంలో విద్యాశాఖ స్థాయిలోనూ 'మేనేజ్' చేయటం ద్వారా తమ తమ కళాశాలల విద్యార్థులు ఎక్కడ పరీక్షలు రాయాలో, వారికి ఇన్విజిలేటర్లుగా ఎవరు రావాలో కూడా నిర్దేశించే స్థాయిలో వుండటం మరింత ప్రమాదకర పరిణామంగా వుంది.

## పాలనా సమస్యలను న్యాయస్థానాల్లోకి నెడ్తున్న ప్రభుత్వాలు

ఎప్పటిలానే ఈ సంవత్సరమూ మార్చిలో ఇంటర్ పరీక్షరాసిన విద్యార్థులలో దాదాపు మూడు లక్షలమంది మే నెలలో 'ఎమ్సెట్' వ్రాశారు. ఇంటర్ ఫలితాలు, ఆపై జూన్లో ఎమ్సెట్ ఫలితాలు ప్రకటించి నెలరోజులు దాటినా ఇంజనీరింగ్ విద్యాసంస్థలలో ప్రవేశానికి ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించకపోవటం విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపున కేంద్ర ప్రభుత్వ సిబిఎస్ఇ హఠాత్తుగా ప్రవేశపెట్టిన నూతన పర్సెంటైల్ విధానంతో ఐఐటి ప్రవేశపరీక్షలో మంచిర్యాంకు పొందినా కూడా, సీటురాక అనేకమంది విద్యార్థులు తీవ్ర ఆశాభంగం చెంది, న్యాయస్థానాలనాశ్రయించి అంతిమ తీర్పుకై పడిగాపులు గాస్తున్నారు.

రాష్ట్రంలో రెండవ విడత అధికారంలోకి రావటానికి ముందుగా 2008లో రాజశేఖరరెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీ ఎంబర్స్మెంటు విధానాన్ని ప్రవేశపెట్టింది. (ఆనాటి నుండి ప్రైవేటు ఇంజనీరింగు కళాశాలలకు దోచిపెడ్తున్న దాదాపు 15వేల కోట్లరూపాయల ప్రజాధనాన్ని, ప్రభుత్వరంగంలోనే ఇంజనీరింగ్ కళాశాలల స్థాపనకు వెచ్చించివుంటే ఐదువందల మెరుగైన ఇంజనీరింగు కళాశాలలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మితమైవుండేవని 'జనశక్తి' గణాంకాలతో గతంలోనే వివరించింది.)

రాజశేఖరరెడ్డి మరణానంతరం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రులు రీఎంబర్సుమెంటు పథకాన్నుండి క్రమంగా వెనక్కు తగ్గటానికి లోపాయికారీ పద్ధతులతో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ వస్తున్నారు. నిబంధనలను ప్రతిసంవత్సరం కఠినతరంజేస్తూ విద్యార్థులను మానసిక క్షోభకు, నిరంతర వత్తిడికి గురిచేస్తోన్నారు.

రీఎంబర్స్మెంటు ఫీజునే ఆదాయవనరుగా మలచుకొని రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా వెలసిన ఇంజనీరింగు కళాశాలల్లో వసతులు, బోధన - బోధనేతర సిబ్బంది, ప్రయోగశాలలు, కనీస నాణ్యతా ప్రమాణాలు లేవని తెలిసినా, ఆయా కళాశాలల్లో ఫీజులను మొత్తంమీద పెంచుతూ పరిమితి దొంతరలను ప్రభుత్వం నిర్ణయించింది. అయినా సంతృప్తి చెందని కొన్ని కళాశాలల యాజమాన్యాలు, తమను 'అధికఫీజు దొంతర'లో వుంచాలని కోర్టుకెక్కాయి. ఈ సాకుతో ప్రభుత్వం ఇంజనీరింగు ప్రవేశాలకు ప్రకటన చేయకుండా, సాంకేతిక కారణాలు చూపుతూ జాప్యం చేస్తోంది. విద్యాసంవత్సర ప్రారంభానికి ముందుగానే ఫీజులు, నియమావళి తదితర అంశాలన్నింటినీ స్పష్టం చేయవలసిన ప్రభుత్వం, దీనికి భిన్నంగా జాగుచేస్తూ లక్షలాదిమంది విద్యార్థుల, వారి తల్లిదండ్రుల మానసిక క్షోభకు కారణమౌతోంది. పరిపాలనావరంగా పరిష్కరించవలసిన సమస్యలను రాజకీయ నాయకత్వం బాధ్యతతో పరిష్కరించకుండా న్యాయస్థానాలలోకి నెట్టివేయటం ఒక ఆనవాయితీగా మారింది.

## ప్రభుత్వ విధానాలతో దీర్ఘకాల దుష్పరిణామాలు

ఈ జాప్యాల నడుమ డబ్బుపెట్టగలిగినవారు ఇతర రాష్ట్రాలలో పేరుపొందిన ఇంజనీరింగు కళాశాలల్లో సీట్లు సంపాదించుకొని వెళ్ళిపోగా, రాష్ట్రంలోని 'డీమ్డ్' యూనివర్శిటీ కళాశాలల్లో మరికొందరు చేరిపోయారు. 'ప్రతిష్ఠాత్మకమైన' ఎమ్సెట్ ద్వారా అర్హులైన విద్యార్థులకు రెట్టింపు సంఖ్యలో సీట్లు మన రాష్ట్రంలోని ఇంజనీరింగు కళాశాలల్లో వుండటం, దాదాపు లక్షసీట్లు ఏటా భర్తీకాకుండా మిగిలిపోతుండటం- ప్రభుత్వ అసమర్థ, బాధ్యతారహిత, కుటిల రాజకీయ విధానాలకు పరాకాష్ఠ. ఇంజనీరింగు విద్యను పూర్తిచేసుకుంటున్న వారిలో, పెద్దఎత్తున ప్రైవేటు కళాశాలలు ప్రచారం చేసుకుంటున్న 'క్యాంపస్ సెలక్షన్స్'లో ఒక శాతం విద్యార్థులకు కూడా ఉద్యోగాలు లభించకపోతుండగా, ప్రతి సంవత్సరం బయటకొస్తున్న మిగిలిన లక్షలాదిమంది ఇంజనీరింగు గ్రాడ్యుయేట్ల పరిస్థితి అగమ్యగోచరంగా వుంది.

అంతేగాక, ప్రభుత్వం అనుసరిస్తున్న రీఎంబర్సుమెంటు విధానం దీర్ఘకాలికంగా అనేక దుష్ఫలితాలకు కారణమౌతోంది. ఇప్పటికే సామాజిక శాస్త్రాల అధ్యయనం అంతరించిపోతుండగా, అత్యధిక విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులవైపే దృష్టిసారించటంతో (ఈ కోర్సులు పూర్తిచేసిన వారందరికీ ఉద్యోగాలు లభించకపోవటం ఒక సమస్యకాగా) మౌలిక శాస్త్రాలు (బేసిక్సైన్సెస్)పై ఆసక్తి కనబరిచి, అభ్యసించేవారు తగ్గిపోవటం మరో ఆందోళనకర పరిణామం. దీనితో ఏదో మేరకైనా సాగే నూతనావిష్కరణలు, శాస్త్రపరిశోధనలు, నూతన సాంకేతికంతటికీ అనివార్యంగా విదేశాలపై ఆధారపడే దుస్థితితో మరింత పరాధీనత పెరుగుతోంది.

ఈ పరిస్థితులలో... గుత్త కార్పొరేటు విద్యాసంస్థలు నిరాటంకంగా సాగిస్తోన్న దోపిడీని, విచ్చలవిడిగా సాగిస్తున్న విలువల విధ్వంసాన్ని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేయాలి. ప్రైవేటు విద్యాసంస్థలకు దోచిపెడ్తోన్న వేలకోట్లరూపాయల ప్రజాధనాన్ని ప్రభుత్వ విద్యాసంస్థల నిర్మాణానికి, వాటి నాణ్యతా ప్రమాణాల అభివృద్ధికి కేటాయించాలని ఆందోళన చేపట్టాలి. ముఖ్యంగా - దేశ ప్రజలందరికీ ఉపయోగపడే, దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేయగలిగే స్వతంత్ర విద్యావిధానాన్ని, శ్రమతో మేళవించి ఉత్పాదకతను పెంచే, నిరుద్యోగాన్ని నిర్మూలించే శాస్త్రీయ విద్యా విధానాన్ని డిమాండ్ చేస్తూ ఉద్యమించాలి. విద్యా మౌలిక లక్ష్యాలకనుగుణంగా విద్యాబోధన కోసం, విద్యార్థులను దేశభక్తిగల, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే విద్యా విధానానికై విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాతంత్ర మేధావులు సమైక్య ఉద్యమం సాగించటం జరూరు కర్తవ్యంగా వుంది. ★

## జస్టిస్ ఓ చిన్నపరెడ్డి... (చివరిపేజీ నుండి)




**జస్టిస్ చిన్నపరెడ్డికి సంతాపం తెలుపుతున్న వక్తలు**

సీనియర్ న్యాయవాది శ్రీ కర్నాటి రామ్మోహన్ రావు మాట్లాడుతూ, చిన్నపరెడ్డి జీవితకాలంలో శాస్త్రీయ సోషలిజం ఆవశ్యకత గురించి తన ప్రసంగాల ద్వారా విద్యార్థి యువజనుల్లో విస్తృతంగా ప్రచారం చేశారనీ, భావ స్వాతంత్ర్యం గురించి, పౌర ప్రజాస్వామ్య హక్కుల ఆవశ్యకత గురించి న్యాయమూర్తిగా అనేక సంచలన తీర్పులు ఇచ్చారనీ, అందులో దిగంబర కవులపై పెట్టబడ్డ కుట్రకేసును ఉదాహరణగా పేర్కొన్నారు.

బెజవాడ బార్ కౌన్సిల్ మెంబర్ శ్రీ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, జస్టిస్ చిన్నపరెడ్డి అసాధారణవ్యక్తి అని, ఉన్నత స్థాయిలో న్యాయమూర్తిగా కొనసాగుతూ కూడా తాను మార్క్సిస్టునని ప్రకటించుకొన్నాడని, 1982లో సమానపనికి సమాన వేతనం, లింగ వివక్షత లేకుండా అనుసరించాల్సిన విధానాల గురించి ముఖ్యమైన తీర్పులు ఇచ్చారనీ, నేడు ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా జుడీషియల్ రంగం కూడా కార్పొరేటు విధానాలతో ప్రభావితం అవుతున్నదని, చిన్నపరెడ్డి జీవితాన్ని ఈనాటి న్యాయవాదులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి శ్రీ ఆర్ మురళి మాట్లాడుతూ, చిన్నపరెడ్డి గొప్ప న్యాయమూర్తి అని, ఆయన భౌతికంగా మననుంచి వెళ్ళిపోవచ్చు కానీ ఆయన మన హృదయాల్లో ఎల్లకాలం జీవించి వుంటారనీ, ఆయన ప్రముఖమైన తీర్పులిచ్చి న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేశారనీ, ఆయన ఎల్లవేళలా ముద్దాయిలకు ఎక్కువగా అనుకూలంగా వుంటూ వారికి అత్యధిక మేలు జరిగేలా చేసేవారనీ, ఆయన న్యాయవ్యవస్థకు ఎంతో తోడ్పాటునిచ్చారని చెప్పారు.

కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ జి. చక్రధరరావు మాట్లాడుతూ, ఇంతటి మహత్తర కార్యక్రమంలో పాల్గొనటం తన అదృష్టంగా భావిస్తున్నాననీ, జస్టిస్ చిన్నపరెడ్డిగారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సేవలు కొనియాడదగినదనీ, వారుచేస్తున్న సేవలకు శిరసు వంచి అభినందనలు తెలియచేస్తున్నానన్నారు. ఈనాటి లీగల్ వ్యవస్థ అనేక ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నదనీ, తక్కువ వనరులతో ఎక్కువ సర్వీస్‌చేస్తున్నామనీ, పేదవర్గాలు న్యాయంకోసం సుప్రీంకోర్టుదాకా వెళ్ళలేరనీ, ధనిక వర్గాలవారే వెళ్ళగల్గుతారు కాబట్టి, క్రింది కోర్టులనే సుప్రీంకోర్టులుగా భావించి న్యాయం పొందటానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు.

ఇంకా ఈ సభలో సీనియర్ న్యాయవాది శ్రీ తుర్లపాటి భైరిరాజు, బిబిఎ గత ఉపాధ్యక్షులు అబ్దుల్ మతీన్, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు సామాజిక అవగాహనతో చిన్నప్పరెడ్డి చేసిన కృషిని గురించి కొనియాడారు. బిబిఎ మహిళా కార్యదర్శి డి.సుజాత వందనసమర్పణతో సభ ముగిసింది. ఈ సభలో దాదాపు 20మంది న్యాయమూర్తులు, 150కి పైగా న్యాయవాదులు, నగరంలోని వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరై సభను విజయవంతం చేశారు. సభ సన్నాహక కృషిలో ట్రస్టు సంయుక్త కార్యదర్శి వి.బసవరావు, కోశాధికారి బి.గురవారెడ్డి పాల్గొన్నారు.

## 'రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) వార్షిక సంచిక - 2012' పరిచయ సభ

**శ్రీకాకుళం, 22-6-13 :**

'రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) వార్షికసంచిక -2012' పరిచయసభ స్థానిక బాపూజీ కళామందిరంలో సంఘం జిల్లా కార్యదర్శి కా॥ తాండ్ర అరుణ అధ్యక్షతన జరిగింది.

సామాజిక శాస్త్రవేత్త డా॥బి.వి.ఏ.రామారావు నాయుడు వార్షిక సంచికను పరిచయంచేస్తూ మాట్లాడారు. తొలి సామాజిక సంస్కృతీ నిర్మాత రైతేననీ, తరతరాలుగా వంచనకు గురయ్యేదీ రైతేననీ అన్నారు. తొలితరం కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్స్ తరుణాచారీ, మార్పు పద్మనాభంల ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన 5వ అఖిలభారత కిసాన్ మహాసభ చారిత్రక సందర్భాన్ని గుర్తుచేశారు. ఏ చక్రవర్తికీ లోబడక గణతంత్ర వ్యవస్థను నిలబెట్టుకున్న చరిత్ర కళింగప్రాంతానికి వుందనీ, దానిని కాపాడుకోలేకపోతే వ్యవసాయాన్ని కాపాడుకోలేమన్నారు. వీరగున్నమ్మ త్యాగాలను గుర్తుచేస్తూ ఐక్యఉద్యమ నిర్మాణాన్ని ఆయన ఆకాంక్షించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రఅధ్యక్షులు కా॥ యస్.ఝాన్సి మాట్లాడుతూ భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో ఈనాటికీ ఫ్యూడల్ దోపిడీ వివిధ రూపాల్లో కొనసాగుతున్నదన్నారు. సామ్రాజ్యవాదం దేశంలోని సమస్తరంగాలతో పాటు వ్యవసాయాన్ని తన దోపిడీ ప్రయోజనాలకనుగుణంగా మలచిందని, భూస్వామ్య - సామ్రాజ్యవాద దళారీ పాలకులు ఈ విధానాలను ప్రజలపై రుద్దుతూ, వారి దోపిడీకి గేట్లు బార్లా తెరిచారన్నారు. భూమిహీనులైన పేదలు, సన్న - చిన్నకారు రైతులు, దళితులు, గ్రామీణ పేదలంతా ఐక్యపోరాటాలు సాగించాలని, గత రెండు సం॥ల కాలంగా రాష్ట్ర వ్యాపితంగా సాగించిన వివిధ ఆందోళనల సమాహారంగా వార్షిక సంచిక వుందని పేర్కొన్నారు.

ప్రజాసాహితి సంపాదకుడు పి.ఎస్.నాగరాజు మాట్లాడుతూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) వార్షిక సంచిక ప్రాంతాలకు, జండర్లకు, కులాలకు అన్ని విభజన రేఖలకు అతీతంగా సామ్రాజ్యవాద - భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా వ్యవసాయ రంగాన్ని చైతన్యయుతంగా కాపాడుకోవలసిన అవసరాన్ని నొక్కి చెప్తోందన్నారు.

ఏపిటిఎఫ్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ నేల మౌలిక అంశమని, జీవజాలంలోని ప్రతి మూలకం నేలలోనే ఉందన్నారు. మూడవ ప్రపంచ దేశాల్లోని బడుగు, బలహీనవర్గాలను తొలిచేసే ఆధిపత్యం కొనసాగుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా సాగే పోరాటాల నుండి భ్రమలకు గురిచేయటం ద్వారా సామ్రాజ్యవాదం దూరంచేసే ప్రయత్నాలుజేస్తోందని వీటివల్ల అప్రమత్తంగా వుండాలని అన్నారు.

భారత నాస్తిక సమాజం బాధ్యులు బి. జగన్నాధరావు మాట్లాడుతూ వార్షికసంచికలోని విషయాలను విశ్లేషిస్తూ మనిషి అద్భుత ఆవిష్కరణల్లో పుస్తకం ఒకటి అన్న గోర్కీ మాటలను గుర్తుచేశారు. ప్రజల అజ్ఞానమే ప్రభుత్వానికి బలం కనుక, మేధావులు మేల్కొని ప్రజలపక్షం వహించాలన్న టాల్‌స్టాయ్ పిలుపును మేధావులు సదా మదిలో నిలుపుకోవాలన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమనేత బొడ్డేపల్లి అప్పయ్య మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, మేధావులు, చిన్నవ్యాపారులు సంఘటితమై పోరాటాలు సాగించాలన్నారు. వార్షిక సంచికను చదివి చైతన్యం పొందాలన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ డి.వర్మ మాట్లాడుతూ ఈ వార్షికసంచిక అనేక పోరాటాలకు వేదికన్నారు. సోంపేట, కాకరాపల్లి, కొవ్వాడ ఆందోళనలు; లక్ష్మింపేట మారణహోమానికి వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనలకు కేంద్రమైన శ్రీకాకుళంజిల్లాలో ఈ వార్షికసంచిక పరిచయసభ సముచితంగా వుందన్నారు ఈ పోరాటాలను మరింతముందుకు సాగించేందుకు, దేశ, రాష్ట్ర పాలకుల దోపిడీ విధానాలను సమగ్రంగా ఆకళింపుజేసుకొని మూలాలనుండి వ్యతిరేకించాల్సిన ఆవశ్యకతను అర్థం చేసుకునేందుకు ప్రజానుకూల మేధావులకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంత కార్యకర్తలకు ఈ వార్షిక సంచిక తోడ్పడుతుందన్నారు.

ఉపాధ్యాయులు, రచయితలు, మేధావులతో సహా ఈ సభకు 350మంది హాజరయ్యారు. సభానంతరం శ్రీకాకుళ గిరిజనోద్యమ దృశ్యకావ్యం 'పోరుదారి' సి.డి.ని ప్రదర్శించారు. ★

## ఎన్‌కౌంటర్లు... (5వ పేజీ తరువాయి)

చంపినట్లు జాతీయ మానవహక్కుల కమీషన్ నిర్ణయించింది. వాళ్ళని ఫ్యాక్షనిస్టులు, రౌడీలు, బందిపోటు దొంగలపేరిట ఈ పోలీసు అధికారి కాల్చి చంపేశాడు.

2006లో ఆయన ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్లలో 14 నుండి 16 వయస్సు గల బాలికలను, రేప్‌చేసి తర్వాత తుపాకీతో కాల్చిచంపేయటం జరిగింది.

జులై 2012లో చత్తీస్‌ఘడ్‌లో, 'నక్సలైట్ల'పై పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్లో 17మంది బాలలు చంపబడ్డారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఈ విషయమే స్పష్టం చేస్తోంది.

2000 సంవత్సరం తర్వాత కాలంలో దేశంలోని అనేక రాష్ట్రాలలో యీ బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగాయి. అనేకమంది అమాయకులు పోలీసులచేత చంపబడ్డారు. 2001 నుండి ఉత్తర ప్రదేశ్‌లో 140, మణిపూర్‌లో 62, అస్సాంలో 52, గుజరాత్‌లో 22 బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగాయి.

ఈ రకంగా బూటకపు ఎన్‌కౌంటర్లు జరగటం అనేది మనదేశంలో సాధారణ విషయమై పోయింది. ఈ ఎన్‌కౌంటర్లలో చనిపోయినవాళ్ళు నక్సలైట్లో, ఇస్లామిక్ టెర్రరిస్టులో, బందిపోటు దొంగలో, మాఫియాగ్యాంగు మనుషులో అని పోలీసులు చెప్పటం, మీడియా దాన్ని ప్రచారం చేయటం, దాన్నినమ్మిన ప్రజలు, యిది జరుగుతున్నది దేశ వ్యతిరేకులూ, సామాజిక వ్యతిరేకులపైననే కదా అని మౌనంగా అంగీకరించడం జరుగుతోంది.

ఇక ఇష్రత్ జహాన్ కేసు సందర్భంగా మనం మరో విషయాన్ని తెల్సుకోవాలి. దేశంలో ఎక్కడ టెర్రరిస్టు ప్రేలుళ్ళు జరిగినా, అది ముస్లిం టెర్రరిస్టులే, అది కూడా పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న టెర్రరిస్టులే అనే అభిప్రాయాన్ని ప్రజల్లో నాటుకొనేట్లు చేయటం జరిగింది. ఇటువంటి అభిప్రాయాన్ని కలిగించిన వాళ్ళలో జర్నలిస్టులూ, ఐ.బి.అధికారులూ ప్రధానపాత్ర వహించగా, ఇందుకు పరోక్షంగా న్యాయస్థానాలు కూడా ప్రోత్సాహాన్ని కల్పించాయి. ఫలితంగా టెర్రరిస్టులపేరిట అనేకమంది మన దేశంలోని ముస్లిం యువకులు పోలీసు దుర్మార్గాలకు బలయిపోతున్నారు. 'ఇలా ఎందుకు జరిగింది-జరుగుతోంది' అన్న ప్రశ్నకు, 'కర్కారేను ఎవరు చంపారు?' అన్న తన పుస్తకంలో మహారాష్ట్ర మాజీ పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్ అయిన ఎస్.ఎం.ముష్రిఫ్, ఐ.పి.ఎస్ ఒక హేతుబద్ధమయిన పరిశోధన జరిపి, ఆ సందర్భంగా ఒక సమంజసమైన వివరణ యిచ్చారు. దానిప్రకారం : "బ్రాహ్మణ వాదులైన హిందుత్వ వాదులు ఎం.ఎస్. గోల్వాల్కరు ప్రబోధాలతో భారతదేశంలో, ఆర్.ఎస్.ఎస్ ఆధ్వర్యాన భారతదేశంలో మత ఘర్షణలను రెచ్చగొట్టి, సాధారణ హిందువుల దృష్టిని సంస్కరణలనుండి మళ్ళించటానికి ముస్లింలను ఎరచేసే వ్యూహాన్ని రచించారు. 1925లోనే ఏర్పడ్డ ఆర్.ఎస్.ఎస్ ప్రధానంగా మీడియా, ఇంటెలిజెన్సు వ్యవస్థను తన ప్రభావం కిందకు తెచ్చుకొనే లక్ష్యాన్ని చేబట్టింది. ఆ రకంగా దేశంలో ప్రజాభిప్రాయాన్ని తనకనుకూలంగా మలుచుకొంది.

1947 నాటికే ఈ రెండు కీలక సాధనాలపైనా తనపట్టును గణనీయంగా సాధించింది. ఆరోజుల్లో విద్యపైన గుత్తాధిపత్యం బ్రాహ్మణవాదులదే కనుక, జర్నలిస్టు రంగంలోకీ, ఐ.బి.లోకీ బ్రాహ్మణవాదులను చొప్పించింది.

ఫలితంగా ఇంటెలిజెన్సు బ్యూరోను బ్రాహ్మణ వాదులు ఆక్రమించి దేశభద్రతనూ-పరువునూ కాపాడేపేరిట ప్రధానమంత్రి కార్యాలయం యొక్క పూర్తి అనుమతిపొంది రహస్య ఆపరేషన్లు, కోవర్టు (ప్రచ్ఛన్న) ఆపరేషన్లూ, తిరుగుబాటు వ్యతిరేక ఆపరేషన్లూ, 'అంతర్గత భద్రత' 'అంతర్జాతీయ - సంబంధాల' సాకుతో యిష్టారాజ్యంగా వ్యవహరించే రాజ్యపు అనుమతి, ఆమోదాల్ని సంపాదించారు. ఈ అధికారంతో వాళ్ళు టెర్రరిస్టులంటే ముస్లింలే అనే అభిప్రాయం కలుగజేసే 'సమాచారాలను' మీడియాకు అందిస్తోంటే, మీడియాలో వున్న బ్రాహ్మణవాదులు, అదే అభిప్రాయాన్ని ప్రచారంచేసి, ప్రజల్లో ముస్లింలు అంటే టెర్రరిస్టులు, దేశ వ్యతిరేకులు అన్న భావం నాటుకొనేట్లు చేశారు."

దీని కొనసాగింపే. యిప్పటి ఎన్‌కౌంటర్లు, ముస్లింలైన ఇష్రత్ జహాన్ తదితరులను ఎల్.ఇ.టి. టెర్రరిస్టులతో సంబంధం వుందనే ఒక అబద్ధపు సమాచారాన్ని సృష్టించి, వాళ్లు నరేంద్రమోడీని హత్య చేసేందుకు పథకంవేశారనే అబద్ధపు సమాచారం ప్రచారంచేసి, వాళ్లని బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపివేయటం!

వాస్తవానికి ఈనాటికీ 2008 మాలెగాల్ ప్రేలుళ్ళకు పాల్పడిన నిజమైన హిందుత్వవాద టెర్రరిస్టులైన కల్నల్ పురోహిత్, సాధ్వి ప్రజ్ఞాసింగ్‌లను, సాక్ష్యాధారాలున్నా శిక్షించటం జరగలేదు. పైపెచ్చు యీ హిందూత్వవాద టెర్రరిస్టులను బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్‌లు 'హిందుత్వవాద జాతీయవాదులు'గా పొగుడుతూ, వాళ్ళను విడుదల చేయాలని పదే పదే డిమాండ్‌చేస్తూ వస్తున్నారు.

ఈరకంగా రాజ్యం యొక్క ఆమోదంతోనే, రాజ్యంయొక్క ప్రోత్సాహంతోనే, ప్రభుత్వ అధికారంలో ఏ రాజకీయపార్టీలవారున్నా, ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు సునాయసంగా జరిగి పోతున్నాయి. అమాయక దేశప్రజలు పోలీసులచేత అమానుషంగా చంపబడుతున్నారు.

ఈనాడు మనం చర్చించాల్సింది ఈ కీలకమయిన అంశం తప్ప, పోలీసులు చంపినది నక్సలైట్లనా, తీవ్రవాదులనా, టెర్రరిస్టులనా అన్న అంశంకాదు. మనది ప్రజాస్వామ్య దేశం అని చెప్పుకొంటున్నాం కాబట్టి, మన రాజ్యాంగం దేశ ప్రజలకు అనేక హక్కులనూ, నిష్పక్ష న్యాయం పొందే హక్కును యిచ్చిందంటున్నాం కాబట్టి, అదే వాస్తవమైతే, వాళ్ళు నక్సలయిట్లయినా, తీవ్రవాదులైనా, టెర్రరిస్టులైనా, బందిపోటులైనా, మాఫియాగ్యాంగు వాళ్ళైనా, మరెవరైనా పట్టుకొని నిర్బంధించాలి. వాళ్ళని పోలీసులు న్యాయస్థానంలో నిలబెట్టి, తగు సాక్ష్యాలతో శిక్షింపబడేటట్లు చేయాలే తప్ప, ఎటువంటి కారణం మాటునైనా వాళ్ళను కాల్చిచంపేందుకు వీలులేదు. ఇటువంటి దుర్మార్గాన్ని ఏ వ్యవస్థలో వున్న ప్రజలైనా అనుమతించ వీలులేదు -అనుమతించరు. ప్రత్యేకించి ప్రజాస్వామ్య వ్యవస్థ అనబడేదాంట్లో యిటువంటి బూటకపు ఎన్‌కౌంటర్లు అస్సలు అనుమతింపబడకూడదు.

సి.బి.ఐ నిర్దిష్టంగా తన ఛార్జిషీటులో పేర్కొనక పోయినా, ఈ బూటకపు ఎన్‌కౌంటర్ రాజ్యం యొక్క ఆమోదంతో, ప్రోత్సాహంతో పోలీసులు జరిపిన హత్యే అన్నది నిర్వివాదాంశమైన విషయం.

ఈ బూటకపు ఎన్‌కౌంటరుతోపాటు, దేశంలో ఏపేరిట జరిగిన బూటకపు ఎన్‌కౌంటరునైనా గర్హించాలి! వ్యతిరేకించాలి!

ఇది ప్రజాతంత్రవాదులు ప్రత్యేకంగా చేపట్టాల్సిన కర్తవ్యం! న్యాయవ్యవస్థకు అతీతమైన ఇటువంటి హింసను దేశప్రజలు సహించకూడదు!.

ఈ బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించటం ద్వారానే రాజ్యప్రేరణతో పోలీసులు జరుపుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్యలను నివారించగలుగుతాం!

అందుకు ప్రజాతంత్రవాదులనూ, విద్యావంతులనూ, మేధావులనూ నడుంకట్టాల్సిందిగా 'జనశక్తి' విజ్ఞప్తి చేస్తోంది. ★

## గుంటూరుజిల్లా... (చివరి పేజీ నుండి)

ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు కా॥డివిఎన్‌స్వామి మాట్లాడుతూ జీవించేహక్కు కోసం, జీవన ప్రమాణాల మెరుగుదల కోసం పీడిత ప్రజలు సాగించే పోరాటం న్యాయమైనది, అత్యంత ప్రజాస్వామికమైనదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా 616సర్వే నెంబరులోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో నిరుపేదలకు నివాసస్థలాలు మంజూరు చేయాల్సిందిగా డిమాండ్‌చేశారు.

ఇంకా ఈ ధర్నాలో సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కామ్రేడ్ సింహాద్రి లక్ష్మారెడ్డి, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కామ్రేడ్ దానబోయిన భాస్కరరావు తదితరులు పాల్గొని నిరుపేద గుడిశెవాసులపై పోలీసుల దాష్టీకాన్ని ఖండించారు. అనంతరం జిల్లా అధికారులకు మెమోరాండం అందజేశారు. గుడిశెవాసులంతా తమ స్థలాలను తిరిగి సాధించుకునే కృతనిశ్చయంతో మరలివెళ్ళారు.

తిరిగి 15-7-13న మండల కేంద్రమైన దుర్గిలో బాధిత గుడిశెవాసులంతా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి, తహసిల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తమ నివాసస్థలాల డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులతోపాటు స్థానికనాయకులు కామ్రేడ్ సత్తయ్య, మరియదాసు, కొండలు,సూరయ్య, వెంకన్న, శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నాయకత్వంవహించారు. ★

# గుంటూరుజిల్లా-దుర్గిలో నిరుపేద దళిత, గిరిజన, బలహీనవర్గాల ప్రజల గుడిశెల కూల్చివేత రెవిన్యూ, పోలీసు అధికారుల బీభత్సం-ప్రజానిరసన



దుర్గిలో నిరుపేదలు నిర్మించుకున్న గుడిశెలు-గుడిశెలు కూల్చివేస్తున్న పోలీసులతో ప్రజల పెనుగులాట-గుడిశెల కూల్చివేతను నిరసిస్తూ గుంటూరులో ధర్నా

**గుంటూరుజిల్లా** - మండల కేంద్రమైన దుర్గి గ్రామంలో, తలదాచుకోను గూడులేని నిరుపేదలందరూ గత నాలుగు సంవత్సరాలుగా తమకు ఇండ్లస్థలాలు కేటాయించాలని కోరుతూ జిల్లాలోని వివిధ స్థాయిల్లోని ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తులు చేస్తూవచ్చారు. సెంటు స్థలం లక్షరూపాయలు పలుకుతున్న ఈ రోజుల్లో కూలిడబ్బులు కూటి గింజలకే సరిపోని, రెక్కల కష్టంపై ఆధారపడ్డ ఆ నిరుపేదలకు స్థలం కొనుగోలు చేసి స్వంతంగా ఇళ్ళు కట్టుకునే స్థోమతలేదు. అనేక సం॥లుగా అద్దె గదులలో వుంటూ అద్దెబకాయిలు చెల్లించలేక, పిల్లలు పెరిగి పెద్దవారై, పెండ్లిడ్లయి, చిన్న చిన్న గదులలో రెండు, మూడు కుటుంబాలు కాపురముంటూ నానా అవస్థలు పడ్తున్నారు.

ఇండ్ల స్థలాలు కావలసిన అర్హులైనవారు అర్జీలు ఇవ్వమని రెవిన్యూ సదస్సు, రచ్చబండల వంటి కార్యక్రమాలలో ప్రభుత్వాధికారులు కోరగా, ఒక్కొక్కరు వందో, రెండొందలో ఖర్చుపెట్టుకొని పనులు మానుకొని మరోసారి అర్జీలు పెట్టుకున్నారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 450మంది నిరుపేదలు ఫోటోలు, రేషనుకార్డు కాపీలు జతచేసి రెండు సం॥ల క్రితమే రచ్చబండ కార్యక్రమంలో దుర్గి విఆర్ఓకు అందజేశారు. ప్రజల వేడుకోళ్ళు, విజ్ఞప్తులు ఏలినవారి చెవికెక్కలేదు. అధికారులు ఒకరి తర్వాత మరొకరు మారుతున్నారేగానీ సమస్య పరిష్కారం గాలేదు. వచ్చిన ప్రతి అధికారీ, 'అర్జీలు పెట్టుకోండి... పరిష్కరిస్తాం' అంటున్నాడే గానీ, అంతకుముందుగా ఇచ్చిన అర్జీల గురించి ప్రస్తావించటంలేదు. ఇలా సంవత్సరాల తరబడి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయారు.

ఈ నేపథ్యంలో, దుర్గి గ్రామంలోని నిరుపేద దళిత, గిరిజన, బలహీనవర్గాలకు చెందిన, నూటికి నూరుపాళ్ళు అర్హులైన వందలాది కుటుంబాల శ్రామిక ప్రజానీకం రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో కదిలి గ్రామపరిధిలో సర్వేనెం.616లోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఇటవలే గుడిశెలు వేసుకున్నారు. పేదప్రజల సంక్షేమం కోసమే రూపొందిచామన్న సవాలక్షపథకాలలో ఏ ఒక్కదాని ద్వారానైనా నిరుపేద శ్రామిక ప్రజానీకానికి నివాస స్థలాలు కేటాయించని తమ నిర్వాకాన్ని, ప్రజా సమస్యలపట్ల తమ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యాన్ని గమనించని ప్రభుత్వం, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని ఆరోపిస్తూ ప్రజలను నేరస్థులుగా నిలిపింది.

6-7-2013న తెలతెలవారుతుండగానే పోలీసుల బలగాలను, రెవిన్యూ సిబ్బందిని వెంటబెట్టుకుని, రెండు బుల్డోజర్లతో నిరుపేదల గుడిశెలను కూల్చివేయటానికి దుర్గిమండల తహసిల్దారు తరలివచ్చాడు. తమ గుడిశెలను కూల్చవద్దనీ, తమ బ్రతుకులను బజార్న పడవేయవద్దనీ గుడిశెవాసులంతా తహసిల్దారును వేడుకున్నా ఆయన కనికరించలేదు.

నిరుపేదల గుడిశెలను కూల్చివేయాలనే కృతనిశ్చయంతో అక్కడికి వచ్చిన రెవిన్యూ, పోలీసు అధికారులు బుల్డోజర్లకు అడ్డుగా నిలిచిన నాయకులను, ప్రజలను ఈడ్చి వ్యానుల్లోకుక్కి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అడ్డుకోబోయిన ప్రజలపై -మహిళలని, గర్భిణీస్త్రీలని, వృద్ధులని, రోగగ్రస్తులనీ కనికరం జూపకుండా డొక్కల్లో పొడిచి, లాఠీలతో వీపులుపగులగొట్టి, ఎదురు రొమ్ములపై పిడిగుద్దులు గుద్ది నడిరోడ్డుపై ఈడ్చివేశారు. ప్రజలను పరుగెత్తించి మరీకొట్టారు. శ్రామికుల ఆస్తిపాస్తులైన కుండ-చట్టి, కంచం-మంచాలను సైతం వదలకుండా బుల్డోజర్లను గుడిశెలపైకి ఎక్కించి తొక్కించారు. మంచినీటికొరకు ప్రజలు ఏర్పరచుకొన్న నీళ్ళట్యాంకును ధ్వంసం చేశారు. ప్రజల హాహాకారాల నడుమ పోలీసుల పహారాలో ఉదయం నుండి చీకటిపడే వరకు నిర్విరామంగా పేదల గుడిశెలను కూల్చివేసి యుద్ధ బీభత్సాన్ని సృష్టించారు.

### ఆందోళనామార్గంలో గుడిశెవాసులు

దుర్గిలో నిరుపేదల గుడిశెలను కూల్చివేయడాన్ని రెవిన్యూ -పోలీసు అధికారుల బీభత్సం, లాఠీఛార్జీలను నిరసిస్తూ 8-7-13న రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో గుంటూరులో బాధితులైన గుడిశెవాసులు ఆగ్రహంతో కదంతొక్కారు. తొలుత రైల్వేస్టేషన్ నుండి వందలాది మంది ఎర్రజెండాలు చేబూని, పోలీసుల దుర్మార్గాన్ని ఎలుగెత్తి ఖండిస్తూ, తమకు నివాసస్థలాలు కేటాయించాలని డిమాండ్‌చేస్తూ కలెక్టరు కార్యాలయం వద్దకు ప్రదర్శన నిర్వహించారు. 'ప్రజావాణి' జరుగుతున్న జిల్లాపరిషత్ కార్యాలయం వద్దకు చేరుకొని అక్కడే బైఠాయించి ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా బాధిత ప్రజలనుద్దేశించి రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కా॥మేడ్స్ పాటిబండ్ల కోటేశ్వరరావు, ఉల్లిగడ్డల నాగేశ్వరరావులు మాట్లాడుతూ నివాసస్థలాలు సాధించుకునేవరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. పల్నాడు ప్రాంతంలోనే వందల, వేల ఎకరాల ప్రభుత్వ భూములను బడా సిమెంటు పరిశ్రమల యాజమాన్యాలకు అప్పనంగా కట్టబెడుతున్న ప్రభుత్వం, దుర్గి మండలంలోనే చందన బ్రదర్స్‌కు, రీజెన్సీ కంపెనీకి, సంపన్న డాక్టర్లు, యాక్టర్లకు భూములను సమకూరుస్తున్న ప్రభుత్వం, నిరుపేదలకు తలదాచుకోను సెంటు స్థలాన్ని కేటాయించకపోవటాన్ని బట్టే వీరి దళిత బహుజనుల ఉద్ధరణ బూటకత్వం వెల్లడవుతోందన్నారు.

(తరువాయి 7వ పేజీలో)

## తాత్కాలిక ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకై 'ఛలో అసెంబ్లీ'




హైదరాబాద్‌లో ప్రదర్శన

**హైదరాబాద్, 19-7-13 :**

రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలలో ఎన్.ఎమ్.ఆర్ / దినసరివేతన / కన్‌సాలిడేటెడ్‌పే / టైంస్కేలు తదితర తాత్కాలిక విధానాలపై 25.11.93 (కటాఫ్‌తేది)కి పూర్వం నియమింపబడి, కటాఫ్ తేదీనాటికి 5సం॥ల సర్వీసు పూర్తిగాని సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణ కొరకై ఉద్యోగులు గత చాలాకాలంగా ఆందోళన సాగిస్తున్నారు.

20-25 సం॥ల సర్వీసుతో తాత్కాలిక సిబ్బందిగా కొనసాగుతున్న సిబ్బంది తమ సర్వీసుల క్రమబద్ధీకరణకై వివిధ రూపాలలో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళుతున్నా ఫలితం కానరాకపోవడంతో ఐక్య కార్యాచరణలో భాగంగా తెలుగుగంగ టైంస్కేలు సిబ్బంది సంఘం, వొకేషనల్ లెక్చరర్స్ సంఘం, జూ॥లెక్చరర్ల సంఘం తదితర సంఘాలన్నింటితో కలసి 19-6-13న "ఛలో అసెంబ్లీ"కార్యక్రమం చేపట్టారు.

అన్ని సంఘాలవారు సుందరయ్య పార్క్ నుండి ఇందిరాపార్క్ వరకు ప్రదర్శన నిర్వహించారు. 25.11. 93(కటాఫ్ తేదీ)లోపు నియమింపబడిన సిబ్బంది సర్వీసులను క్రమబద్ధీకరించాలని, 2/94 చట్టాన్నిసవరించాలనే నినాదాలతో ర్యాలీకొనసాగింది.

అనంతరం ఇందిరాపార్క్ వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో సభ జరిగింది. ఈ సభలో సి.పి.ఐ శాసనసభా పక్షనేత గుండా మల్లేష్, సి.పి.యం పార్టీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, పి.డి.ఎఫ్ ఎమ్మెల్సీ శర్మ ప్రసంగించారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రఅధ్యక్షులు, టి.జి.పి సంఘ అధ్యక్షులు కా॥సి.పెద్దన్న ప్రసంగిస్తూ 25సం॥ల సర్వీసుతో దీర్ఘకాలికంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో ఎవరైనా మరణిస్తే దహనసంస్కారం ఖర్చుకూడా ప్రభుత్వం చెల్లించడంలేదని, మరుసటి రోజు నుండి ఆ కుటుంబ పోషణకర్త లేక కుటుంబాలు వీధిన పడుతున్నాయని, ప్రస్తుతానికి 3సం॥ల నుండి 10సం॥ల గరిష్ఠ సర్వీస్ మాత్రమే వున్నదని, అదనపు ఆర్థికభారం నామమాత్రం కావున వీరి సర్వీసుల క్రమబద్ధీకరణకై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవటాన్ని తీవ్రంగా ఖండించారు. కావున వివిధ శాఖలలో పనిచేస్తున్న సిబ్బంది ఐక్యకార్యాచరణగా ఏర్పడి పోరాటాలకు సిద్ధంకావాలని పోరాటం ద్వారానే ఫలితాలు వస్తాయని పిలుపునిచ్చారు.

ఈ సభకు సమన్వయకర్తగా వ్యవహరించిన యూనివర్శిటీ సిబ్బంది సంఘం గౌరవాధ్యక్షులు, సిఐటియు నాయకులు ఏ.వి.నాగేశ్వరరావు ప్రసంగిస్తూ 2/94 చట్టానికి సవరణచేసి 25.11.93నాటికి పూర్వం నియమించబడిన సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణ చేయాలని, ఆ సవరణ జరగాలంటే వత్తిడిద్వారానే వీలవుతుందని, కావున మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వివిధ సంఘాలనేతల ప్రసంగాల అనంతరం కార్యవర్గం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీని కలసి సమస్యను వివరించి వినతిపత్రం సమర్పించింది. ★

## 'జస్టిస్ ఓ. చిన్నపరెడ్డి - ఎ లెజెండ్' పుస్తక పరిచయసభ



సభకు హాజరైన న్యాయవాదులు; సభలో ప్రసంగిస్తున్న ప్రధాన న్యాయమూర్తి

**విజయవాడ, 4-7-13 :**

ప్రముఖ ప్రజాతంత్రవాది, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, అమరులు ఓ. చిన్నపరెడ్డిపై తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రచురించిన "జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి-ఎ లెజెండ్" అన్న ఇంగ్లీషు పుస్తక పరిచయసభను బెజవాడ బార్ అసోసియేషన్ మరియు తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా విజయవాడలోని బెజవాడ బార్ అసోసియషన్ హాల్‌లో నిర్వహించాయి. ఈ సభకు బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మట్టా జయకర్ అధ్యక్షతవహించి మాట్లాడుతూ, ప్రముఖ న్యాయవాది, మానవతావాది జస్టిస్ చిన్నపరెడ్డి గురించి బెజవాడ బార్ అసోసియేషన్ భాగస్వామ్యంతో సభ జరుపుకోవటం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. తొలుత చిన్నప్పరెడ్డిగారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ సభ రెండునిముషాలు మౌనం పాటించింది.

చిన్నప్పరెడ్డిగారి ఉపన్యాసాలు, రచనల సంకలనం 'జస్టిస్ చిన్నపరెడ్డి-ఎ లెజెండ్' పుస్తకాన్ని టి.ఎన్.మెమోరియల్‌ట్రస్టు కార్యదర్శి డా॥ పి. జస్వంతరావు పరిచయంచేస్తూ మానవతావాది, ప్రగతిశీల మేధావి, సామాజిక మార్పుకొరకు శాస్త్రీయ సోషలిజం అవసరం అని ప్రముఖ న్యాయమూర్తిగా తన జీవితకాల ఆచరణ ద్వారా చిన్నప్పరెడ్డిగారు నిరూపించారనీ, సమాజంలోని అసమానతలకు, దోపిడీ అణచివేతలకు మూలకారణాలను పరిశోధించి ఆయన చివరిశ్వాస వరకు పీడిత వర్గాలవైపు నిలబడ్డారనీ, ఈ సామాజిక అవగాహన వెలుగులోనే భావస్వాతంత్ర్యంలో భాగంగా రాజకీయ విశ్వాసాలు కలిగి వుండటం నేరంకాదని అనేక చారిత్రాత్మక తీర్పులను ఇచ్చారని చెబుతూ ఆయన నైతిక నిబద్ధత గురించి కొనియాడారు.

విశ్రాంత జిల్లా జడ్జి శ్రీ డి. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రముఖ మార్క్సిస్టు మేధావి తరిమెల నాగిరెడ్డి రాజకీయ జీవితంలోని ఘట్టాలు ఎంత ఉత్తేజకరంగా సాగాయో, అలానే చిన్నప్పరెడ్డి సామాజిక న్యాయవాదిగా సాగించిన ప్రస్థానం మరపురాని ఉత్తేజాన్ని కలిగిస్తుందని చెప్పారు.

(తరువాయి 7వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010